ప్రజా
# రిపబ్లిక్
ప్రతి అక్షరం ప్రజల కోసం
RNI No:/2023/87888

**పాత్రికేయులు కావలెను**

తెలంగాణ, ఆంధ్ర రాష్ట్ర వ్యాప్తంగా వెలువడుచున్న

ప్రజా రిపబ్లిక్

తెలుగు దినపత్రికలో తెలుగు రాష్ట్రాలలో బ్యూరోలు , జిల్లా స్టాపర్లు, నియోజకవర్గ మరియు మండల స్థాయి

పాత్రికేయులు కావలెను.

ఆసక్తి గలవారు సంప్రదించండి
9948814188 9985876888

Published From Nandyal : Cerculated in Nandyal,Kurnool,Kadapa,tirupathi,Prakasam, Krishna,Guntur,Nellore and All Distircts

సంపుటి - 02 సంచిక -346 | పేజీలు - 8 | వెల - 03/- | శుక్రవారం 3 ఏప్రిల్ 2026




# రాజ్యసభలోనూ ఆమోదం

వాకౌట్ చేసిన వైసీపీ

అమరావతికి చట్టపరమైన భరోసా కల్పిస్తూ చట్టసవరణ బిల్లు

రాజ్యసభలో చర్చ అనంతరం బిల్లుకు ఆమోదం

ఇప్పటికే లోక్ సభలో బిల్లుకు ఆమోదం



2లో.

# రాజధానిలో సంబరాలు



## ప్రజాస్వామ్య గొప్పదనాన్ని చాటిన చారిత్రక రోజు:చంద్రబాబు

ఉద్దండరాయుని పాలెంలో రైతుల సభకు సతీసమేతంగా హాజరైన సీఎం చంద్రబాబు

అమరావతిని చంపాలనుకున్న వైసీపీ బాగుపడదని తీవ్ర విమర్శలు

శంకుస్థాపన ప్రదేశంలో పవిత్ర మట్టి, జలాలకు సాష్టాంగ నమస్కారం చేసిన సీఎం



**అమరావతిఏప్రిల్ 02 (రిపబ్లిక్ న్యూస్):** ఆంధ్రప్రదేశ్ ఏకైక రాజధానిగా అమరావతికి చట్టబద్ధత కల్పిస్తూ పార్లమెంట్ ఏకగ్రీవంగా ఆమోదించడంతో రాజధాని ప్రాంత గ్రామాల్లో సంబరాలు అంబరాన్నంటాయి. ఈ చారిత్రక విజయాన్ని పురస్కరించుకుని రైతులు, మహిళలు నిర్వహించిన వేడుకల్లో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సతీసమేతంగా పాల్గొన్నారు. 2015లో ప్రధాని నరేంద్ర మోదీ ఎక్కడైతే రాజధానికి శంకుస్థాపన చేశారో, అదే ఉద్దండరాయుని పాలెంలో జరిగిన ఈ కార్యక్రమం భావోద్వేగాల మధ్య సాగింది. ముఖ్యమంత్రి చంద్రబాబు దంపతులకు రైతులు, మహిళలు అపూర్వ స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో మంత్రులు నాదెండ్ల మనోహర్, పొంగూరు నారాయణ, అచ్చెన్నాయుడు, బీజేపీ ఏపీ అధ్యక్షుడు మాధవ్, ఎమ్మెల్యే తెనాలి శ్రావణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో సీఎం చంద్రబాబు మాట్లాడుతూ.. ఇది దేశ చరిత్రలోనే సువర్ణాక్షరాలతో లిఖించదగిన రోజని, ప్రజాస్వామ్య గొప్పదనాన్ని, ప్రజా సంకల్పాన్ని చాటి చెప్పిందని అభివర్ణించారు.

మిగతా 2లో.

## జ్యుడీషియల్ అధికారుల నిర్బంధంపై సుప్రీంకోర్టు ఆగ్రహం



**న్యూఢిల్లీ :ఏప్రిల్ 02 (రిపబ్లిక్ న్యూస్):** పశ్చిమ బెంగాల్‌లో ఎన్నికలు దగ్గరపడుతున్న వేళ..ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ (ఎస్ఐఆర్) విధుల్లో ఉన్న జ్యుడీషియల్ అధికారులను నిర్బంధించిన ఘటనపై సుప్రీంకోర్టు గురువారం

మిగతా 2లో.

# ఉద్యోగులకు తీపికబురు

ఉద్యోగులకు రూ.7,358 కోట్ల పెండింగ్ బిల్లుల విడుదలకు గ్రీన్ సిగ్నల్

ఏ మాత్రం నిధుల లభ్యత ఉన్నా పెండింగ్ బిల్లులను చెల్లించాలని ముఖ్యమంత్రి ఆదేశం

బిల్లుల చెల్లింపుల్లో చిన్న కాంట్రాక్టర్లకు పెద్ద పీట వేయాలని ముఖ్యమంత్రి సూచన

పెండింగ్ బిల్లుల చెల్లింపులపై ఆర్థిక శాఖ అధికారులతో ముఖ్యమంత్రి సమీక్ష



**అమరావతిఏప్రిల్ 02 (రిపబ్లిక్ న్యూస్):** గత ప్రభుత్వం నుంచి వారసత్వంగా వచ్చిన పెండింగ్ బిల్లుల చెల్లింపులపై గురువారం ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆర్థిక శాఖపై సమీక్షించారు. ఈ మేరకు రాష్ట్రంలోని ప్రభుత్వ ఉద్యోగులు, రిటైర్డ్

మిగతా 2లో.

## గ్రామీణాభివృద్ధికి కేంద్రం పెద్దపీట

పంచాయితీ నిధుల విడుదలే సాక్ష్యం కేంద్రమంత్రి కిషన్ రెడ్డి వెల్లడి



**హైదరాబాద్,ఏప్రిల్ 02 (రిపబ్లిక్ న్యూస్):** ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం గ్రామీణాభివృద్ధికి చిత్తశుద్ధితో కృషి చేస్తోందని కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి కిషన్ రెడ్డి అన్నారు. 15వ ఆర్థిక సంఘం సిఫార్సుల మేరకు 2025-26 సంవత్సరానికి

మిగతా 2లో.



2లో.

## ప్రధాని మోదీకి కృతజ్ఞతలు

ఎన్డీయే ఎంపీలతో కలిసి ప్రధాని, లోక్‌సభ స్పీకర్‌తో లోకేశ్ భేటీ

అమరావతి రైతుల త్యాగాలను ప్రధానికి వివరించినట్లు వెల్లడి

లోక్‌సభలో ఆమోదం పొందిన ఏపీ పునర్వ్యవస్థీకరణ సవరణ బిల్లు

రాజ్యసభ ఆమోదం కోసం ఢిల్లీలోనే పర్యటిస్తున్న లోకేశ్

## తెలంగాణలో 2 లక్షల కొత్త పెన్షన్లు..

రేవంత్ సర్కార్ కీలక నిర్ణయం

చేయూత కింద 2 లక్షల కొత్త పెన్షన్లకు ప్రభుత్వం ఆమోదం

బడ్జెట్‌లో రూ.233 కోట్లు కేటాయించిన రేవంత్ సర్కార్

మూడేళ్లుగా పేరుకుపోయిన 12 లక్షలకు పైగా దరఖాస్తులు



2లో.

# హర్మూజ్ మార్గం పునరుద్ధరణే లక్ష్యం..

35 దేశాలతో భేటీకి భారత్ హాజరు

హర్మూజ్ జలసంధి సంక్షోభంపై యూకే ఆధ్వర్యంలో 35 దేశాల సమావేశం

ఈ కీలక భేటీకి భారత్‌ను ఆహ్వానించిన యునైటెడ్ కింగ్‌డమ్

వర్చువల్ సమావేశానికి హాజరుకానున్న భారత విదేశాంగ కార్యదర్శి విక్రమ్ మిశ్రీ



**న్యూఢిల్లీ :ఏప్రిల్ 02 (రిపబ్లిక్ న్యూస్):** ఇజ్రాయెల్, అమెరికా దాడుల నేపథ్యంలో ఇరాన్ మూసివేసిన హర్మూజ్ జలసంధి సంక్షోభం అంతర్జాతీయంగా తీవ్ర ఆందోళన కలిగిస్తోంది. ప్రపంచ ఇంధన రవాణాలో కీలకమైన ఈ మార్గాన్ని తిరిగి తెరిపించేందుకు యునైటెడ్ కింగ్‌డమ్ (యూకే) నడుం బిగించింది. ఇందులో భాగంగా 35 దేశాలతో నిర్వహిస్తున్న అత్యవసర సమావేశానికి భారత్‌ను కూడా ఆహ్వానించింది. గురువారం వర్చువల్‌గా జరిగే ఈ భేటీలో భారత విదేశాంగ కార్యదర్శి విక్రమ్ మిశ్రీ పాల్గొంటారని విదేశాంగ శాఖ అధికార ప్రతినిధి

మిగతా 2లో.


# డయాఫ్రమ్ కంప్లీట్

ఏపీ జీవనాడి పోలవరం ప్రాజెక్టులో మరో కీలక ఘట్టం పూర్తయింది: చంద్రబాబునాయుడు

తక్కువ సమయంలో డయాఫ్రమ్ వాల్ నిర్మాణం పూర్తయిందన్న ముఖ్యమంత్రి

ప్రాజెక్టు నిర్మాణంలో ఇది అత్యంత కీలకమన్న ముఖ్యమంత్రి

తక్కువ సమయంలో పూర్తి చేశారంటూ అధికారులకు కితాబు



2లో.

# రాజధానిలో సంబరాలు

**మొదటి పేజీ తరువాయి**

"అమరావతి చరిత్ర శాశ్వతం, అందులో రైతులు చేసిన త్యాగం శాశ్వతం. అనేక కుట్రలను ఎదుర్కొని ప్రజా రాజధానిని సాధించుకున్నాం. ఇది ప్రజల విజయం" అని చంద్రబాబు ఉద్ఘాటించారు. ఈ బిల్లుకు సహకరించిన ప్రధాని మోదీ, హోం మంత్రి అమిత్ షాతో పాటు దేశంలోని అన్ని రాజకీయ పార్టీలకు ఆయన ధన్యవాదాలు తెలిపారు. ఒక్క వైసీపీ మినహా అందరూ అమరావతికి అండగా నిలిచారని గుర్తుచేశారు.

**అమరావతిని శ్మశానం అన్న వాళ్లు అడ్రస్ లేకుండా పోయారు: చంద్రబాబు**

గత ప్రభుత్వ తీరుపై చంద్రబాబు తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. "అమరావతిని శ్మశానం అన్నారు, కానీ ఇవాళ పార్లమెంటులో దానికి తిరుగులేని శాసనం చేశాం. రాజధానితో మూడు ముక్కలాట ఆడిన వాళ్లు ఇప్పుడు అడ్రస్ లేకుండా పోయారు" అని విమర్శించారు. రాజధాని కోసం 29 వేల మంది రైతులు 33 వేల ఎకరాలు ఇస్తే, ప్రజా వేదికను కూల్చి విధ్వంసానికి



పాల్పడ్డారని ఆరోపించారు. ఇంత జరిగినా వైసీపీకి బుద్ధి రాలేదని, పార్లమెంటులో బిల్లుపై చర్చ జరుగుతుంటే వారి ఎంపీలు వాకౌట్ చేశారని, ప్రజలు ఆ పార్టీని బ్లాక్ అవుట్ చేయాలని పిలుపునిచ్చారు. వారి 'మావిగన్' అనే కొత్త ప్రతిపాదన అర్థం కాలేదని, వైసీపీవన్నీ బుద్ధిలేని వ్యాఖ్యలని, దుర్మార్గపు ఆలోచనలని దుయ్యబట్టారు.

**ఇది ప్రజా విజయం, రైతుల త్యాగం శాశ్వతం**

రాజధాని కోసం రైతులు, మహిళలు 1631 రోజుల పాటు చేసిన వీరోచిత పోరాటాన్ని చంద్రబాబు స్మరించుకున్నారు. నాడు ఉద్యమ శిబిరాలకు తాను సతీసమేతంగా వచ్చానని, రైతుల కష్టాలు చూసి తన భార్య భువనేశ్వరి చలించిపోయి తన చేతి గాజులను విరాళంగా ఇచ్చారని గుర్తుచేసుకున్నారు. పవన్ కల్యాణ్ ముళ్ల కంచెలు దాటుకుని వచ్చి మద్దతు తెలిపారని, తాను స్వయంగా జోలె పట్టి విరాళాలు సేకరించానని చెప్పారు. శంకుస్థాపన ప్రదేశంలో చంద్రబాబు దంపతుల ప్రత్యేక

**పూజలు.. సాష్టాంగ ప్రణామం**

రాష్ట్రంలోని ప్రతీ ప్రాంతాన్ని అభివృద్ధి చేస్తామని అమరావతి సాక్షిగా హామీ ఇచ్చారు. "అమరావతి ఇక అన్‌స్టాపబుల్. ఇది అద్వితీయం, అజేయం, అజరామరం" అని చంద్రబాబు స్పష్టం చేశారు. అనంతరం చంద్రబాబు దంపతులు ప్రధాని మోదీ శంకుస్థాపన చేసిన శిలాఫలకాన్ని పరిశీలించారు. పవిత్ర మట్టి, జలాలు ఉన్న వేదిక వద్ద సాష్టాంగ ప్రణామం చేసి, ప్రత్యేక పూజలు నిర్వహించి దీప హారతి ఇచ్చారు. ఈ కార్యక్రమం రాజధాని చరిత్రలో ఒక ముఖ్యమైన ఘట్టంగా నిలిచిపోయింది.

# ఉద్యోగులకు తీపికబురు

**మొదటి పేజీ తరువాయి**

ఉద్యోగుల పెండింగ్ బిల్లుల చెల్లింపులపై ఆరా తీశారు. ఉద్యోగుల పెండింగ్ బిల్లుల చెల్లింపులు జరపాలని గతంలో ఇచ్చిన ఆదేశాలను ఏ మేరకు అమలు చేశారని అడిగారు. ముఖ్యమంత్రి సూచనల మేరకు కసరత్తు చేశామని, నిధుల లభ్యతను బట్టి చెల్లింపులను జరుపుతున్నామని అధికారులు వివరించారు.

ఉద్యోగులకు రిలీఫ్ ఇచ్చేలా మొత్తంగా రూ.7,358 కోట్ల మేర పెండింగ్ బిల్లుల విడుదలకు చర్యలు తీసుకున్నామని అధికారులు ముఖ్యమంత్రికి తెలిపారు. దీంట్లో భాగంగా ఇప్పటికే ప్రావిడెంట్ ఫండ్ బకాయిల కింద రూ.1,848 కోట్లను నేరుగా ఉద్యోగుల ఖాతాల్లో జమ చేశామని, అలాగే గ్రూప్ లైఫ్ ఇన్సూరెన్స్ కింద 4,793 మందికి సంబంధించిన రూ.76 కోట్ల చెల్లింపులు కూడా పూర్తి చేశామని వెల్లడించారు.వీటితో పాటు గ్రాట్యుటీ బకాయిల కింద రూ.3,411 కోట్లు, పెండింగులో ఉన్న రిటైర్డ్ ఉద్యోగుల లీవ్ ఎన్‌క్యాష్‌మెంట్ కింద రూ.1,800 కోట్లు, పోలీస్ శాఖకు సంబంధించి అదనపు సరెండర్ లీవుల నిమిత్తం రూ.223 కోట్ల బిల్లుల విడుదల ప్రక్రియ కొనసాగుతోందని మరో రెండు రోజుల్లో చెల్లింపులు పూర్తి చేస్తామని అధికారులు ముఖ్యమంత్రికి చెప్పారు. తల్లికి వందనం తర్వాత ఒకేసారి ఇంత పెద్ద మొత్తంలో చెల్లింపులు జరుపుతోంది ఉద్యోగులకు మాత్రమేనని అధికారులు ముఖ్యమంత్రికి వివరించారు. నిధుల లభ్యతను బట్టి ఉద్యోగుల పెండింగ్ బిల్లుల సహా అన్ని రకాల పెండింగ్ బిల్లులకు చెల్లింపులు జరపాలని ముఖ్యమంత్రి దిశా నిర్దేశం చేశారు.ఈ సందర్భంగా గత ప్రభుత్వ హయాంలో ఉద్యోగుల విషయంలో జరిగిన పరిణామాలు ప్రస్తావనకు వచ్చాయి. నాడు ఉద్యోగుల సొంత సొమ్మును కూడా నాటి ప్రభుత్వం ఇతర అవసరాలకు మళ్లించడంతో వారు తీవ్ర ఇబ్బందులుపడ్డారని, తమ నిధుల కోసం ప్రశ్నించిన నేతలపై కేసులు పెట్టి వేధించారనే అంశం చర్చకు వచ్చింది.ఇదే సమీక్షా సమావేశంలో వివిధ పనులు చేసిన కాంట్రాక్టర్లకు, మెటిరియల్ సరఫరా చేసిన వారికి జరపాల్సిన చెల్లింపులపైనా ముఖ్యమంత్రి ఆరా తీశారు. వివిధ శాఖలకు మెటీరియల్ సరఫరా చేసిన చిన్న చిన్న కాంట్రాక్టర్లకు రూ.614 కోట్ల బకాయిల చెల్లింపులు జరిపామని అధికారులు తెలిపారు. పనులు చేసిన, మెటిరీయల్ సరఫరా చేసిన వాళ్లకు బిల్లులు చెల్లింపులు జరిపే ప్రక్రియలో చిన్న కాంట్రాక్టర్లకు పెద్ద పీట వేయాలని ముఖ్యమంత్రి ఆదేశించారు.

# రాజ్యసభలోనూ ఆమోదం

న్యూఢిల్లీ :

ఆంధ్రప్రదేశ్ రాజధానిగా అమరావతికి చట్టబద్ధత కల్పించే బిల్లుకు రాజ్యసభలోనూ ఆమోదం లభించింది. దీంతో ఈ బిల్లుకు పార్లమెంట్ ఉభయ సభల ఆమోదముద్ర ప్రక్రియ ముగిసింది. అనంతరం ఈ బిల్లును కేంద్ర ప్రభుత్వం రాష్ట్రపతికి పంపనుంది. ఈ బిల్లుపై రాష్ట్రపతి ద్రౌపది ముర్ము సంతకం చేసిన తరువాత గెజిట్ నోటిఫికేషన్ విడుదలకానుంది. గురువారం రాజ్యసభలో కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి నిత్యానంద రారు బిల్లును ప్రవేశపెట్టనున్నారు. అనంతరం రాజ్యసభ చైర్మన్ సిపి రాధాకృష్ణన్ ఈ బిల్లుపై చర్చకు అనుమతి ఇచ్చారు. ఈ చర్చలో 11 పార్టీలు నుంచి 18 మంది సభ్యులు పాల్గొన్నారు. అయితే వైసిపి రాజ్యసభలో కూడా బిల్లును వ్యతిరేకించి సభ నుంచి వాకౌట్ చేసింది.

**నాడు హైదరాబాద్ అభివృద్ధికి చంద్రబాబు కృషి చేశారు: తెలంగాణ బీజేపీ ఎంపీ**

దూరదృష్టి గల నాయకుడిగా ఆనాడు హైదరాబాద్ అభివృద్ధికి చంద్రబాబునాయుడు కృషి చేశారని, విభజన తర్వాత ఏపీకి అమరావతి రాజధానిగా సంకల్పం తీసుకుని ముందుకు సాగుతున్నారని తెలంగాణ బీజేపీ నాయకుడు, రాజ్యసభ ఎంపీ డాక్టర్ కె. లక్ష్మణ్ అన్నారు. అమరావతికి ప్రధాని మోదీ శంకుస్థాపన చేశారని, రెండు రాష్ట్రాల అభివృద్ధికి ఎన్డీయే కట్టుబడి ఉందని అన్నారు. అమరావతి చట్టబద్ధత బిల్లుపై రాజ్యసభలో చర్చ సందర్భంగా ఆయన మాట్లాడారు.వికసిత్ ఆంధ్రప్రదేశ్ కోసం వికసిత్ రాజధాని అవసరమని ఆయన అన్నారు. రాజధాని అమరావతి కోసం 29 వేలమంది రైతులు 33 వేల ఎకరాలు ఇచ్చారని గుర్తు చేశారు. భవ్య రాజధాని కోసం ఏపీ ప్రజలు కలలు కన్నారని పేర్కొన్నారు. ప్రధాని మోదీ వికసిత్ భారత్ సంకల్పం సాకారమయ్యేందుకు వికసిత్ ఆంధ్ర నిర్మాణం అవశ్యమన్నారు. రాజధాని అవసరమని, కానీ జగన్ తన హయాంలో మూడు ముక్కలాడి రైతులు, మహిళలను ఇబ్బందులకు గురి చేశారని ఆరోపించారు.

రాజధాని కోసం చాలాకాలంగా పోరాడిన మహిళలకు, రైతులకు ఆయన శిరస్సు వంచి నమస్కరిస్తున్నట్లు తెలిపారు. అమరావతి బిల్లు కోసం దేశం మొత్తం ఆసక్తిగా చూస్తోందని అన్నారు. తెలుగు వారికి ప్రత్యేక ఆంధ్రరాష్ట్రం కావాలని నాడు పొట్టి శ్రీరాములు 58 రోజులు నిరాహార దీక్ష చేసినా, నాటి కాంగ్రెస్ ప్రభుత్వం స్పందించలేదని మండిపడ్డారు. ఆంధ్ర రాష్ట్రం కోసం ఆయన ప్రాణాలు త్యాగం చేశారని అన్నారు. ఆయన మరణానంతరం ప్రభుత్వం స్పందించి ఆంధ్ర రాష్ట్రం ఇచ్చిందని అన్నారు

## అమరావతి బిల్లుపై ప్రధాని మోదీకి కృతజ్ఞతలు తెలిపిన మంత్రి లోకేశ్, ఎన్డీయే ఎంపీలు..

న్యూఢిల్లీ :**ఏప్రిల్ 02 (రిపబ్లిక్ న్యూస్):**

ఏపీ ఏకైక రాజధానిగా అమరావతికి చట్టబద్ధత కల్పిస్తూ పార్లమెంట్‌లో బిల్లును ఆమోదించినందుకు ప్రధాని నరేంద్ర మోదీకి రాష్ట్ర మానవ వనరుల అభివృద్ధి శాఖ మంత్రి నారా లోకేశ్ కృతజ్ఞతలు తెలిపారు. ఢిల్లీలో ఎన్డీయే ఎంపీలతో కలిసి ఆయన ప్రధానిని కలిశారు. ఈ సందర్భంగా ప్రధానికి శాలువా కప్పి, ఏపీ ప్రజల తరఫున ధన్యవాదాలు తెలియజేశారు. ఈ భేటీ అనంతరం లోకేశ్ 'ఎక్స్'లో పోస్ట్ చేస్తూ.. "అమరావతి కోసం తమ భూములను త్యాగం చేసి, ఏళ్ల తరబడి నిలబడిన రైతుల అసాధారణ గాథను ప్రధానికి వివరించాను. వారి త్యాగాలను గౌరవిస్తూ, అమరావతిని ప్రపంచ స్థాయి రాజధానిగా నిర్మించేందుకు ఆయన మార్గనిర్దేశం కోరాను" అని పేర్కొన్నారు.అనంతరం లోకేశ్, ఇతర ఎంపీలు లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లాను కూడా కలిసి బిల్లు



ఆమోదానికి సహకరించినందుకు ధన్యవాదాలు తెలిపారు. అలాగే, కేంద్ర పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి కిరణ్ రిజిజును కూడా కలిసి అమరావతికి చట్టబద్ధత కల్పించడానికి సహకరించినందుకు కృతజ్ఞతలు తెలియజేశారు. లోకేశ్ వెంట కేంద్ర మంత్రులు కింజరాపు రామ్మోహన్ నాయుడు, పెమ్మసాని చంద్రశేఖర్‌తో పాటు టీడీపీ, జనసేన, బీజేపీ ఎంపీలు ఉన్నారు.ఆంధ్రప్రదేశ్ పునర్వ్యవస్థీకరణ (సవరణ) బిల్లు 2026 బుధవారం లోక్‌సభలో ఆమోదం పొందింది. ఈ బిల్లు నేడు రాజ్యసభ ముందుకు రానుంది. ఎగువ సభలోనూ ఇది ఏకగ్రీవంగా ఆమోదం పొందే అవకాశం ఉంది. ఈ ప్రక్రియను పర్యవేక్షించేందుకే లోకేశ్ ఢిల్లీ పర్యటనకు వచ్చారు. 2014 నాటి పునర్వ్యవస్థీకరణ చట్టంలోని సెక్షన్ 5ను సవరిస్తూ.. 'కొత్త రాజధాని' అనే పదం స్థానంలో 'అమరావతి కొత్త రాజధానిగా ఉంటుంది' అని ఈ బిల్లు స్పష్టం చేస్తోంది. తన పర్యటనలో భాగంగా లోకేశ్, కేంద్ర హోంమంత్రి అమిత్ షా, ఉపరాష్ట్రపతి, రాజ్యసభ ఛైర్మన్ సీపీ రాధాకృష్ణన్‌ను కూడా కలవనున్నారు.

# గ్రామీణాభివృద్ధికి కేంద్రం పెద్దపీట

**మొదటి పేజీ తరువాయి**

సంబంధించిన మొదటి విడత నిధులు విడుదలపై ఆయన హర్షం వ్యక్తం చేశారు. తెలంగాణ గ్రామ పంచాయతీల కోసం రూ.619.85 కోట్లు విడుదల చేయడాన్ని స్వాగతించారు కేంద్ర మంత్రి. ఈ మేరకు ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, కేంద్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి రాజీవ్ రంజన్ సింగ్ ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. కేంద్ర ప్రభుత్వం 'సబ్‌కా సాథ్.. సబ్‌కా వికాస్' మంత్రాన్ని అక్షరాలా ఆచరణలో పెడుతూ ప్రతి గ్రామం సమగ్రాభివృద్ధికి బాటలు వేస్తోందన్నారు. కేంద్రం విడుదల చేసిన రూ.619.85 కోట్ల నిధుల్లో రూ.371.91 కోట్లు టైడ్ గ్రాంట్, రూ.247.94 కోట్లు అన్ టైడ్ గ్రాంట్ కింద ఉన్నాయన్నారు. టైడ్ గ్రాంట్ నిధులతో గ్రామాల్లో రోడ్ల నిర్మాణం, పారిశుద్ధ్యం, తాగునీటి సరఫరా, మురుగునీటి శుద్ధి, వర్షపు నీరు సంరక్షణ, ప్రజల జీవన ప్రమాణాల పెంపు వంటి అనేక పనులు చేయవచ్చన్నారు. అన్ టైడ్ గ్రాంట్ నిధులను మాత్రం స్థానిక అవసరాలకు అనుగుణంగా గ్రామ సభల్లో నిర్ణయం తీసుకుని అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టుకోవచ్చని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి తెలిపారు. 15వ ఆర్థిక సంఘం సిఫార్సుల ప్రకారం.. గ్రామీణ స్థానిక సంస్థలకు కేటాయించిన నిధులు కేంద్రం నుంచి రాష్ట్రాలకు అందిన వెంటనే ఆయా రాష్ట్రాల ఆర్థిక శాఖలు 10 పని దినాలలోపు సంబంధిత గ్రామ పంచాయతీలకు నిధులను వెంటనే బదిలీ చేయాల్సి ఉంటుంది. అంతకుమించి ఆలస్యం జరిగితే రాష్ట్ర ప్రభుత్వాలు ఇతర పథకాల కోసం తీసుకున్న మార్కెట్ రుణాలు/రాష్ట్ర అభివృద్ధి రుణాల(ఎస్‌డీఎల్)పై చెల్లిస్తున్న వడ్డీ రేటు ప్రకారం గ్రామ పంచాయతీలకు వడ్డీతో కలిపి చెల్లించాల్సి ఉంటుంది. అలాగే కేంద్రం విడుదల చేసిన నిధులకు సమానంగా మ్యాచింగ్ గ్రాంట్లు విడుదల చేయాల్సిన బాధ్యత రాష్ట్ర ప్రభుత్వానిదేనని అన్నారు.తాజాగా 2025–26కు సంబంధించి రూ.619.85 కోట్లను మొదటి విడత కింద విడుదల చేసింది. ఇక, 16 ఆర్థిక సంఘం కింద 2026–27 నుంచి 2030–31 మధ్య కాలంలో తెలంగాణలోని గ్రామ పంచాయతీలు రూ.9,968 కోట్లను గ్రాంట్ రూపంలో కేంద్రం నుంచి పొందనున్నాయి. తెలంగాణ ప్రభుత్వం సకాలంలో పంచాయతీ ఎన్నికలు నిర్వహించని కారణంగా.. రెండేళ్ల పాటు (2023–24, 2024–25 ఆర్థిక సంవత్సరాలకు సంబంధించిన) నిధులు పెండింగ్‌లో ఉన్నాయి. ఇటీవల గ్రామ పంచాయతీలకు ఎన్నికలు జరిగిన తర్వాత కేంద్రం వాటిని విడుదల చేసింది. తాజాగా 2025–26 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి మొదటి విడత నిధులనూ కేంద్రం విడుదల చేసింది. గతంలో బీఆర్ఎస్, కాంగ్రెస్ ప్రభుత్వాలు గ్రామ పంచాయతీలకు నిధులు ఇవ్వకుండా కేంద్రం ఇచ్చిన నిధులను పక్కదారి పట్టించాయి. అయినప్పటికీ.. గ్రామాల అభివృద్ధి కోసం కేంద్రం యుటిలైజేషన్ సర్టిఫికెట్లు సమర్పించగానే నిధులను విడుదల చేసింది. తెలంగాణలో పంచాయతీ ఎన్నికలను రేండెళ్లపాటు నిర్వహించకుండా స్పెషల్ ఆఫీసర్ల పాలనతో రాష్ట్ర ప్రభుత్వం నెట్టుకొచ్చింది. ఇకపైనా ఎప్పటికప్పుడు యుటిలైజేషన్

సర్టిఫికెట్లు సమర్పిస్తే తదనుగుణంగా నిధులను విడుదల చేసేందుకు కేంద్ర ప్రభుత్వం సిద్ధంగా ఉందని అంటూ ప్రకటన జారీ చేశారు.

# హర్మూజ్ మార్గం పునరుద్ధరణే లక్ష్యం..

**మొదటి పేజీ తరువాయి**

రణధీర్ జైస్వాల్ ధ్రువీకరించారు.

భారత ఇంధన భద్రతకు హర్మూజ్ జలసంధి అత్యంత కీలకం. దేశం దిగుమతి చేసుకునే ముడి చమురులో 40శాతం, ద్రవీకృత సహజ వాయువు (ఎల్ఎన్‌జీ)లో 50శాతం, ద్రవీకృత పెట్రోలియం గ్యాస్ (ఎల్‌పీజీ)లో 80శాతానిపైగా ఈ మార్గం గుండానే రవాణా అవుతుంది. ఈ నేపథ్యంలో భారత నౌకల రాకపోకలకు ఎలాంటి ఆటంకం కలగకుండా ఇరాన్‌తో పాటు ఇతర సంబంధిత దేశాలతో చర్చిస్తున్నామని జైస్వాల్ తెలిపారు. ఈ చర్చల ఫలితంగానే గత కొన్ని రోజుల్లో ఆరు భారత నౌకలు సురక్షితంగా జలసంధిని దాటగలిగాయని ఆయన వివరించారు.

ఈ సంక్షోభంపై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ అనూహ్యంగా స్పందించారు. గతంలో జలసంధిని తెరిపించడం తన ప్రాధాన్యత అని చెప్పిన ఆయన, బుధవారం తన సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్ 'ట్రూత్ సోషల్' వేదికగా ప్లేటు ఫిరాయించారు. "మీ చమురు మీరే తెచ్చుకోండి. మీ కోసం మీరు పోరాడటం నేర్చుకోండి. అమెరికా ఇకపై మీకు సహాయం చేయదు" అంటూ యూకే వంటి మిత్రదేశాలకు ఆయన సూచించారు. ఇరాన్‌ను ఇప్పటికే దెబ్బతీశామని, కష్టమైన భాగం పూర్తయిందని ట్రంప్ పేర్కొన్నారు.

మరోవైపు యూకే ప్రధాని కీర్ స్టార్మర్ మాత్రం ఈ విషయంలో వెనక్కి తగ్గలేదు. ఫ్రాన్స్, జర్మనీ, జపాన్, యూఏఈ సహా 35 దేశాలు సముద్ర భద్రత పునరుద్ధరణకు కలిసి పనిచేయడానికి అంగీకరించాయని ప్రకటించారు. నౌకాయాన స్వేచ్ఛను పునరుద్ధరించడం, చిక్కుకుపోయిన నౌకలు, సిబ్బంది భద్రతను పటిష్టం చేయడం, కీలక సరుకుల రవాణాను తిరిగి ప్రారంభించడం వంటి అంశాలపై ఈ సమావేశంలో చర్చిస్తామని తెలిపారు. యూకే విదేశాంగ కార్యదర్శి వైవెట్ కూపర్ అధ్యక్షతన జరిగే ఈ భేటీ అనంతరం, తదుపరి కార్యాచరణపై అధికారులు చర్చిస్తారని సమాచారం.

# తెలంగాణలో 2 లక్షల కొత్త పెన్షన్లు.. రేవంత్ సర్కార్ కీలక నిర్ణయం

**హైదరాబాద్,ఏప్రిల్ 02 (రిపబ్లిక్ న్యూస్):**

తెలంగాణలో కొత్త పెన్షన్ల కోసం ఏళ్లుగా ఎదురుచూస్తున్న లక్షలాది మందికి రేవంత్ రెడ్డి ప్రభుత్వం శుభవార్త చెప్పింది. చేయూత పథకం కింద కొత్తగా మరో 2 లక్షల మందికి పెన్షన్లు మంజూరు చేయాలని నిర్ణయించింది. ఇందుకు అనుగుణంగా 2026–27 వార్షిక బడ్జెట్‌లో రూ.233 కోట్లను కేటాయించడంతో, లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియకు రంగం సిద్ధమైంది. అయితే, ఇప్పటికే పేరుకుపోయిన లక్షలాది దరఖాస్తుల నుంచి అర్హులను గుర్తించడం అధికారులకు పెను సవాల్‌గా మారనుంది.

ప్రస్తుతం రాష్ట్రవ్యాప్తంగా వివిధ కేటగిరీలలో 42.23 లక్షల మంది నెలనెలా చేయూత పెన్షన్లు పొందుతున్నారు. వృద్ధులు, వితంతువులు, ఒంటరి మహిళలు, గీత, చేనేత కార్మికులు, హెచ్ఐవీ, బోదకాలు బాధితులకు నెలకు రూ.2,016 చొప్పున ప్రభుత్వం అందిస్తోంది. దివ్యాంగులకు మాత్రం పెన్షన్‌ను రూ.4,016గా ఇస్తున్నారు. ఇప్పుడు ఈ జాబితాలోకి మరో 2 లక్షల మంది కొత్తగా చేరనున్నారు. గత మూడేళ్లుగా బోదకాలు, డయాలసిస్ బాధితులకు తప్ప కొత్తగా ఎలాంటి పెన్షన్లు మంజూరు కాకపోవడంతో అర్హులైన వారు తీవ్ర నిరాశలో ఉన్నారు.ఈ నేపథ్యంలో, రాష్ట్రవ్యాప్తంగా సుమారు 12 లక్షలకు పైగా దరఖాస్తులు ప్రభుత్వానికి చేరి పెండింగ్‌లో ఉన్నాయి. ఇటీవల బడ్జెట్‌లో కొత్త పెన్షన్ల ప్రకటన వెలువడిన తర్వాత, ఫిబ్రవరి 20 నుంచి ప్రజావాణి వంటి కార్యక్రమాల ద్వారా దరఖాస్తులు వెల్లువెత్తుతున్నాయి. దీనికి తోడు, గురువారం రాష్ట్రవ్యాప్తంగా జరుగుతున్న గ్రామసభల్లో కూడా భారీగా దరఖాస్తులు వచ్చే అవకాశం ఉందని అధికారులు అంచనా వేస్తున్నారు.ప్రభుత్వం ఆమోదించినవి 2 లక్షల పెన్షన్లు కాగా, ఇప్పటికే పెండింగ్‌లో ఉన్న దరఖాస్తుల సంఖ్య 12 లక్షలు దాటింది. వీటిలో వృద్ధాప్య పింఛన్ కోసం 4 లక్షలు, వితంతు, ఒంటరి మహిళల కోటాలో 3.5 లక్షలు, గీత, చేనేత కార్మికుల విభాగంలో 3 లక్షలు, దివ్యాంగుల పింఛన్‌కు 72 వేల దరఖాస్తులు ఉన్నాయి. ఈ భారీ సంఖ్య నుంచి కేవలం 2 లక్షల మంది అత్యంత అర్హులను ఎంపిక చేసేందుకు పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ అధికారులు త్వరలోనే పటిష్టమైన వడపోత కార్యక్రమం చేపట్టనున్నారు. ఈ ప్రక్రియ పారదర్శకంగా నిర్వహించడం ప్రభుత్వానికి కత్తిమీద సాములా మారింది.

# జ్యుడీషియల్ అధికారుల నిర్బంధంపై సుప్రీంకోర్టు ఆగ్రహం




**మొదటి పేజీ తరువాయి**

నాడు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. ఈ ఘటనపై కేంద్ర దర్యాప్తు సంస్థ (సిబిఐ) లేదా జాతీయ దర్యాప్తు సంస్థ (ఎన్ఐఏ)తో దర్యాప్తు చేపట్టాలని ఎన్నికల సంఘానికి ఆదేశాలు జారీ చేసింది. బెంగాల్‌లో ప్రతి ఒక్కరూ రాజకీయ భాషే మాట్లాడుతున్నారని విచారణ సందర్భంగా భారత ప్రధానన్యాయమూర్తి (సిజెఐ) జస్టిస్ సూర్యకాంత్ అసహనం వ్యక్తం చేశారు. 'తప్పు ఎవరు చేస్తున్నారో మాకు తెలియదనుకుంటున్నారా? ఈ ఘటనను తెల్లవారుజామున 2 గంటల వరకు పర్యవేక్షిస్తూనే ఉన్నా. ఇది చాలా దురదృష్టకరం' అని ఆయన అన్నారు. ఈ ఘటనపై పలువురు రాష్ట్ర అధికారులకు న్యాయస్థానం షోకాజ్ నోటీసులు జారీ చేసింది. జ్యుడీషియల్ అధికారుల భద్రత కల్పించడంతో పాటు 'సర్' ప్రక్రియకు ఆటంకం కలగకుండా ఉండేందుకు కేంద్ర బలగాలను మోహరించాలని ఎన్నికల సంఘాన్ని ఆదేశించింది.

అసలేం జరిగిందంటే..ఎస్ఐఆర్ పేరుతో పెద్దఎత్తున ఓటర్ల పేర్లను తొలగిస్తున్నారనే ఆరోపణలు వ్యక్తమవుతున్న సంగతి తెలిసిందే. ఈ క్రమంలోనే మాల్దా జిల్లాలో బుధవారం ఆందోళనలు జరిగాయి. ఇక్కడ సర్ విధుల్లో ఉన్న ఏడుగురు జ్యుడీషియల్ అధికారులను సాయంత్రం 4 గంటల ప్రాంతంలో ఆందోళనకారులు నిర్బంధించారు. సమాచారం అందుకున్న భద్రతా సిబ్బంది అర్ధరాత్రి ఒంటి గంట తర్వాత అక్కడికి చేరుకొని అధికారులను రక్షించారు. అడ్డుకున్న ఆందోళనకారులపై పోలీసులు లాఠీఛార్జ్ చేయడంతో ఉద్రిక్తతలు చోటుచేసుకున్నాయి. నిర్బంధానికి గురైన వారిలో ముగ్గురు మహిళా అధికారులు కూడా ఉన్నారు. ఇదే అంశంపై ముఖ్యమంత్రి మమతా బెనర్జీ స్పందిస్తూ ఈ విషయంలో తాను చేసేదేమీ లేదని తెలిపారు. కేంద్ర హోంమంత్రి అమిత్ షా దిశానిర్దేశంలో కీలుబొమ్మగా నడుస్తున్న ఎన్నికల సంఘమే ప్రస్తుతం రాష్ట్రంలో పాలనా వ్యవహారాలు చూస్తోందని, ఈ ఘటనలకు ఇసిదే బాధ్యత అని ఆమె పేర్కొన్నారు.

# డయాఫ్రమ్ కంప్లీట్

**అమరావతిఏప్రిల్ 02 (రిపబ్లిక్ న్యూస్):**

ఆంధ్రప్రదేశ్ జీవనాడి పోలవరం ప్రాజెక్టును పూర్తి చేయాలన్న ప్రభుత్వ సంకల్పంలో నేడు మరో కీలక ఘట్టం పూర్తయిందని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు 'ఎక్స్' వేదికగా ట్వీట్ చేశారు. ప్రాజెక్టు నిర్మాణంలో అత్యంత కీలకమైన 1,372 మీటర్ల పొడవైన 'డయాఫ్రం వాల్' నిర్మాణాన్ని ఇరిగేషన్ శాఖ తక్కువ సమయంలో పూర్తి చేసిందని ప్రశంసించారు. ఇందుకు ఇరిగేషన్ శాఖ అధికారులకు, ఇంజనీర్లకు ఆయన అభినందనలు తెలిపారు.దీనికి సహకరించిన కేంద్ర సంస్థలకు, పోలవరం ప్రాజెక్టు అథారిటీ ప్రతినిధులకు ఆయన ధన్యవాదాలు తెలిపారు. గత పాలకుల నిర్లక్ష్యం కారణంగా డీ–వాల్ దెబ్బతినడంతో అదనంగా రూ.1000 కోట్లు వెచ్చించి నిర్మించామని పేర్కొన్నారు.

డయాఫ్రమ్ వాల్ పూర్తి కావటంతో ప్రధాన కట్టడమైన ఎర్త్ కమ్ రాక్ ఫిల్ (ఈసీఆర్ఎఫ్) డ్యామ్ పనులు వేగవంతమవుతాయని అన్నారు. ఇప్పటికే ప్రకటించినట్లు అన్ని పనులు పూర్తిచేసి 2027 పుష్కరాలకు ముందే పోలవరం ప్రాజెక్టును పూర్తి చేసి జాతికి అంకితమిస్తామని పునరుద్ఘాటించారు.

ప్రజా రిపబ్లిక్
ప్రతి అక్షరం ప్రజల కోసం



# మానవాళి పాపాల కోసం

నేడే గుడ్‌ఫ్రైడే




## సిలువపై ప్రాణాలు అర్పించిన జీసస్

**సమస్త మానవాళి చేసిన పాపాల కోసం ఆయన సిలువపై ప్రాణాలు అర్పించారు. తిరిగి మూడో రోజు సమాధి నుంచి లేచాడు. పొరుగువారిని ప్రేమించాలని వారి తప్పులను క్షమించాలంటూ తాను భూమిపై జీవించిన రోజుల్లో బోధనలు చేశారు. ఆయనే జీసస్. క్రైస్తవ మత విశ్వాసం ప్రకారం యేసుక్రీస్తు శుక్రవారం సిలువ వేయబడ్డాడు. యేసు క్రీస్తు మరణిస్తే శుభ శుక్రవారం లేదా గుడ్ ఫ్రైడే అని ఎందుకు పిలుస్తున్నాము ..? అసలు శుభం ఎలా అవుతుంది..?**

గుడ్ ఫ్రైడే ... శుభశుక్రవారం. చాలామంది తెలియని వారు గుడ్ ఫ్రైడే అంటే ఏదో పండగలా భావిస్తారు. ఇందుకు కారణం ఆ పదంలో గుడ్ అంటే శుభం అని ఉండటమే. వాస్తవానికి గుడ్ ఫ్రైడ్ అంటే క్రైస్తవుల ప్రకారం మానవాళి చేసిన పాపాల కోసం తన ప్రాణాలను జీసస్ సిలువపై పణంగా పెట్టాడని చెబుతారు. జీసస్‌ను సిలువపై వ్రేలాడదీసిన రోజును పవిత్ర శుక్రవారం, లేదా బ్లాక్ ఫ్రైడే అని కూడా పిలుస్తారు. యేసు ప్రభువు చనిపోయిన రోజును గుడ్ ఫ్రైడేగా పిలుస్తారు. ఈ రోజున క్రైస్తవులు ఉపవాసం ఉండి దేవున్ని తలచుకుంటారు. ప్రార్ధనలో గడుపుతారు.

**వివిధ దేశాల్లో గుడ్ ఫ్రైడేకు పలు రకాల వివరణలు**

ఇదిలా ఉంటే గుడ్ ఫ్రైడే పేరు ఎక్కడి నుంచి వచ్చిందో ఎవరికీ తెలియదు. అయితే గుడ్ ఫ్రైడే అనే ఈ పేరు ఎలా వచ్చిందో అనేదానికి పలువురు పలు రకాలుగా వారి వాదనలు వినిపిస్తున్నారు. శుభ శుక్రవారంలో ఏదో మంచి ఉందని చాలా మంది భావిస్తారు. యేసు ప్రభువు సమస్త మానవాళి చేసిన పాపాలకు తన ప్రాణాలు అర్పించి పునరుత్తానం చెందాడని చెబుతారు. మరికొందరు గుడ్ అనే పదం ఇంగ్లీషులో ఏమైతే అర్థం ఇస్తుందో దాని ప్రకారంగానే హోలీ ఫ్రైడే అని పిలుస్తారని చెప్తారు. లెంట్ కాలంలోనే గుడ్ ఫ్రైడే వస్తుంది. ఈ సమయంలో క్రైస్తవులు మాంసాహారం తీసుకోరు. గుడ్ ఫ్రైడే రోజున ఒక




సారి పూర్తి స్థాయి భోజనం మరో రెండు పూట్ల ఫలహారం తీసుకుంటారు.

**పొరుగువారిని ప్రేమించి వారిని క్షమించాలి:**

యేసుప్రభువు ప్రపంచ వ్యాప్తంగా గుడ్ ఫ్రైడే రోజున ఒకొక్కరూ ఒక్కొక్క పద్ధతిని పాటిస్తారు. కొందరు చర్చిలో ప్రత్యేక ప్రార్ధనలు జరిపి ప్రార్ధనను ముగించేందుకు సూచనగా 33 సార్లు చర్చి గంటను మోగిస్తారు. క్రిస్మస్ వేడుకల కంటే చాలా ప్రాచీనమైనది గుడ్‌ఫ్రైడే. క్రైస్తవుల పవిత్ర గ్రంథం బైబిల్ కూడా జీసస్ పుట్టుక గురించి ఆయన పుట్టిన తేదీ గురించి ఎక్కడా ప్రస్తావించలేదు. కానీ ప్రభువును శిలువ వేయడాన్ని గురించి ప్రస్తావించింది. యూదా ఇస్కరియోత్ అనే యేసు ప్రభువు శిష్యుడు కేవలం 33 వెండి నాణేల కోసం యేసు ప్రభువుకు నమ్మక ద్రోహం చేస్తాడు. క్రీస్తు ఎక్కడున్నాడో సైన్యానికి చెప్పేస్తాడు. ఆ తర్వాత క్రీస్తును తీసుకురావడం ఆయన్ను సిలువ వేయడం సిలువపై వ్రేలాడి ఉండగా ప్రభువు చివరిగా మాట్లాడే ఏడు మాటలను క్రైస్తవులు ఈ రోజు గుర్తు తెచ్చుకుని ప్రత్యేక ప్రార్ధనలు చేస్తారు. క్రీస్తు యేసు తాను భూమిపై బతికున్న రోజుల్లో ఎన్నో బోధనలు చేశారు. అందులో ముఖ్యమైనది తమ పొరుగువారిని ప్రేమించి వారి తప్పులను క్షమించాలని చెప్తారు. దీన్నే క్రైస్తవులు అనుసరిస్తారు.

# కర్నూలును సింగిల్ యూజ్ ప్లాస్టిక్ రహిత నగరంగా తీర్చిదిద్దుదాం

**నిషేధాన్ని కఠినంగా అమలు చేయాలి -జాయింట్ కలెక్టర్ నూరుల్ ఖమర్ ఆదేశాలు**





**కర్నూలు ప్రతినిధి (రిపబ్లిక్ న్యూస్ ఏప్రిల్ 2)**కర్నూలు జిల్లాను సింగిల్ యూజ్ ప్లాస్టిక్ రహిత నగరంగా మార్చేందుకు సమగ్ర చర్యలు చేపట్టాలని జాయింట్ కలెక్టర్ నూరుల్ ఖమర్ పేర్కొన్నారు.గురువారం కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాల్‌లో సింగిల్ యూజ్ ప్లాస్టిక్ నిర్మూలనపై మున్సిపల్ కార్పొరేషన్ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, పర్యావరణ పరిరక్షణలో భాగంగా నగరంలో సింగిల్ యూజ్ ప్లాస్టిక్ నిషేధాన్ని కఠినంగా అమలు చేయాలని అధికారులకు ఆదేశించారు. మున్సిపల్ కమిషనర్ ఆధ్వర్యంలో యుఎల్బి స్థాయి టాస్క్ ఫోర్స్ కమిటీలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు.నెలకు కనీసం రెండుసార్లు అన్ని దుకాణాలను తనిఖీ చేసి, నిషేధిత ప్లాస్టిక్ విక్రయించే వ్యాపారులపై దాడులు నిర్వహించాలని సూచించారు. ప్లాస్టిక్ వస్తువులను స్వాధీనం చేసుకోవడంతో పాటు భారీ జరిమానాలు విధించాలని ఆదేశించారు.ప్లాస్టిక్ రహిత సమాజం కోసం ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని ప్రజలకు పిలుపునిచ్చారు. డప్పు కళాకారులు, సంగీత ప్రదర్శనలు, పబ్లిక్ అనౌన్స్‌మెంట్ల ద్వారా ప్లాస్టిక్ వల్ల కలిగే నష్టాలపై అవగాహన కల్పించాలని సూచించారు.అలాగే, స్వయం సహాయక బృందాల ద్వారా పర్యావరణహిత సంచుల విక్రయ మేళాలను విస్తృతంగా నిర్వహించాలని తెలిపారు.ఈ సమావేశంలో మున్సిపల్ కమిషనర్ విశ్వనాథ్, ఇతర మున్సిపల్ అధికారులు పాల్గొన్నారు.

# జిల్లాలో పశువులకు 5 జనరిక్ మందుల దుకాణాలు ఏర్పాటు

**కర్నూలు సహా ఐదు ప్రాంతాల్లో షాపుల ఏర్పాటు చర్యలు జిల్లా కలెక్టర్ డాక్టర్ ఏ.సిరి**



**కర్నూలు ప్రతినిధి (రిపబ్లిక్ న్యూస్ ఏప్రిల్ 2)**

జిల్లాలో పొట్టేలు, మేకలు, గొర్రెల సంఖ్యను దృష్టిలో ఉంచుకుని పశువులకు అవసరమైన మందులు సులభంగా అందుబాటులోకి తీసుకురావడానికి ఐదు ప్రాంతాల్లో జనరిక్ మందుల దుకాణాలు ఏర్పాటు చేయాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ ఏ.సిరి ఆదేశించారు.శుక్రవారం కలెక్టర్ ఛాంబర్‌లో నిర్వహించిన సమావేశంలో, పశుసంవర్ధక శాఖకు చెందిన షీప్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఈ అవుట్‌లెట్లు ఏర్పాటు చేసే అంశంపై చర్చించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ కర్నూలు, ఆదోని, పత్తికొండ, కోడుమూరు, హోలగుంద ప్రాంతాల్లో ప్రభుత్వ పశువైద్యశాలలు లేదా ప్రభుత్వ స్థలాల్లో ఈ దుకాణాలు ప్రారంభించేందుకు చర్యలు తీసుకోవాలని సూచించారు.దుకాణాల ఏర్పాటులో భాగంగా ఆర్ అండ్ బి శాఖ ద్వారా రెంట్, లీజ్ ప్రతిపాదనలు సిద్ధం చేయడం, డ్రగ్ కంట్రోల్ విభాగం ద్వారా లైసెన్సులు జారీ చేయడం, అలాగే సహకార సంఘాల ద్వారా నాలుగు దుకాణాలు మరియు ఒక దుకాణాన్ని స్వయం సహాయక బృందం ఆధ్వర్యంలో ఏర్పాటు చేయాలని అధికారులకు ఆదేశించారు.పశుసంవర్ధక శాఖ జెడి హేమంత్ కుమార్ మాట్లాడుతూ ఒక్కో దుకాణం యూనిట్ ఖర్చు రూ.3.61 లక్షలుగా నిర్ణయించామని తెలిపారు. హోలగుందలో స్వయం సహాయక బృందం ద్వారా ఏర్పాటు చేసే దుకాణానికి కేంద్ర ప్రభుత్వం నుండి రూ.1.50 లక్షల సబ్సిడీ లభిస్తుందని, మిగిలిన నాలుగు దుకాణాలకు ఆంధ్రప్రదేశ్ షీప్ ఫెడరేషన్ అదే మొత్తంలో సబ్సిడీ అందిస్తుందని వెల్లడించారు.ఈ సమావేశంలో పశుసంవర్ధక శాఖ, ఆర్ అండ్ బి, డ్రగ్ కంట్రోల్, సహకార శాఖల అధికారులు పాల్గొన్నారు.

# చేనేత కుటుంబాలకు ఉచిత విద్యుత్

**నెలకు 200 యూనిట్లు, పవర్లూమ్‌లకు 500 యూనిట్లు**

**జిల్లాలో 2457 చేనేత కుటుంబాలకు లబ్ధి - కలెక్టర్ డా. ఏ. సిరి ధృవపత్రాల పంపిణీ**







**కర్నూలు ప్రతినిధి (రిపబ్లిక్ న్యూస్ ఏప్రిల్ 2)**

చేనేత కార్మికుల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుని ఉచిత విద్యుత్ పథకాన్ని అమలు చేస్తోందని జిల్లా కలెక్టర్ డా. ఏ. సిరి తెలిపారు. ఈ పథకం కింద చేనేత కుటుంబాలకు నెలకు 200 యూనిట్లు, పవర్లూమ్ యూనిట్లకు నెలకు 500 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ అందిస్తున్నట్లు వెల్లడించారు.
కలెక్టరేట్‌లో నిర్వహించిన కార్యక్రమంలో ఈ పథకానికి సంబంధించిన కరపత్రాలను విడుదల చేసి, 7 మంది లబ్ధిదారులకు ధృవపత్రాలు అందజేశారు.
కలెక్టర్ మాట్లాడుతూ, ఈ పథకం ద్వారా ఒక్కో చేనేత కుటుంబానికి నెలకు సుమారు రూ.720 చొప్పున సంవత్సరానికి రూ.8,640 లబ్ధి కలుగుతుందని చెప్పారు.
అలాగే, పవర్‌లూమ్ యూనిట్ నిర్వాహకులకు నెలకు రూ.1,800 చొప్పున సంవత్సరానికి రూ.21,600 వరకు ఆర్థిక ప్రయోజనం అందుతుందని వివరించారు.
కర్నూలు జిల్లాలో ఈ పథకం ద్వారా మొత్తం 2457 చేనేత కుటుంబాలు మరియు ఒక మరమగ్గ కుటుంబం లబ్ధి పొందనున్నట్లు తెలిపారు.
ఈ పథకం వల్ల చేనేత కార్మికులపై విద్యుత్ ఖర్చు భారం తగ్గి, వారి జీవనోపాధి మెరుగుపడటంతో పాటు ఉత్పత్తి సామర్థ్యం పెరుగుతుందని, గ్రామీణ ఉపాధికి కూడా ప్రోత్సాహం లభిస్తుందని కలెక్టర్ పేర్కొన్నారు. చిన్న స్థాయి, గృహాధారిత చేనేత కార్మికులకు ఇది ఎంతో ఉపయోగకరమని తెలిపారు.ఈ కార్యక్రమంలో జిల్లా చేనేత & జౌళి శాఖ అధికారులు, అభివృద్ధి అధికారులు, చేనేత కార్మికులు మరియు నాయకులు పాల్గొన్నారు.

# ప్రకృతి వ్యవసాయానికి ప్రాధాన్యం భూసారం

**ప్రజల ఆరోగ్య పరిరక్షణకు కలెక్టర్ దిశానిర్దేశం**

**పీఎండీఎస్, గ్రీన్ మెన్యూర్, మల్టీ క్రాపింగ్‌పై దృష్టి - రైతుల ఆదాయం పెంపే లక్ష్యం**






**కర్నూలు ప్రతినిధి (రిపబ్లిక్ న్యూస్ ఏప్రిల్ 2)**

భూసారాన్ని పెంపొందించడంతో పాటు ప్రజల ఆరోగ్యాన్ని కాపాడేందుకు ప్రకృతి వ్యవసాయాన్ని విస్తృతంగా ప్రోత్సహించాలని జిల్లా కలెక్టర్ డా. ఏ. సిరి అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్‌లో సహజ వ్యవసాయంపై నిర్వహించిన జిల్లా స్థాయి శిక్షణ కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు.
ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రైతులు పీఎండీఎస్ పచ్చి రొట్ట ఎరువుల వినియోగాన్ని పెంచాలని సూచించారు. ప్రకృతి వ్యవసాయం ద్వారా చిన్న స్థలంలోనే మంచి ఆదాయం సాధ్యమని ఉదాహరణతో వివరించారు. కూలి పనుల కోసం వలస వెళ్లే పరిస్థితి తగ్గి, స్వయం ఉపాధి అవకాశాలు పెరుగుతాయని పేర్కొన్నారు.
పిల్లి పెసర, సన్ హెంప్, దైంచా వంటి గ్రీన్ మెన్యూర్ పంటలను ప్రోత్సహించాలని, అధికారులు క్షేత్ర స్థాయిలో పర్యటిస్తూ రైతులకు అవగాహన కల్పించాలని ఆదేశించారు. ఈ ఏడాది వర్షపాతం తక్కువగా ఉండే అవకాశం ఉన్నందున, స్థానిక పరిస్థితులకు అనుగుణంగా పంటల ఎంపికలో రైతులకు మార్గదర్శకత్వం ఇవ్వాలన్నారు.పత్తి, మల్లె, మామిడి, అరటి, దానిమ్మ వంటి పంటలను ప్రోత్సహిస్తూ, ప్రతి రైతు కనీసం నాలుగు రకాల పంటలు సాగు చేయాలని సూచించారు. మల్లె సాగును 1000 హెక్టార్లకు విస్తరించే లక్ష్యాన్ని ప్రకటించారు. ఉద్యానవన పంటల అభివృద్ధి ద్వారా రైతులకు తక్కువ కాలంలో మంచి ఆదాయం లభిస్తుందని తెలిపారు.రైతు ఉత్పత్తిదారుల సంఘాల బలోపేతం, మార్కెట్ అధ్యయనం, లాజిస్టిక్ పార్కుల ఏర్పాటు వంటి చర్యల ద్వారా రైతుల ఆదాయం పెంచాలని సూచించారు.
వ్యవసాయంలో డ్రోన్లు, యంత్రాల వినియోగాన్ని పెంచి ఖర్చులు తగ్గించాలని తెలిపారు. యూరియా వినియోగాన్ని తగ్గించి నానో యూరియాను ప్రోత్సహించాలని అన్నారు.
పశుసంవర్ధక రంగాన్ని బలోపేతం చేస్తూ ప్రతి రైతు కనీసం ఒక పశువునైనా పెంచాలని, అవసరమైన వారికి రుణాల ద్వారా సహాయం అందించాలని ఆదేశించారు.
రైతుల తలసరి ఆదాయం పెంపే ప్రధాన లక్ష్యమని స్పష్టం చేశారు.సమావేశంలో జిల్లా వ్యవసాయ అధికారి వరలక్ష్మి, ఉద్యాన శాఖ అధికారి రాజాకృష్ణ రెడ్డి, న్యాచురల్ ఫార్మింగ్ అధికారి మాధురి తదితరులు పాల్గొన్నారు.

# సానుకూల ప్రజాభిప్రాయం పెంపుదలపై ప్రత్యేక దృష్టి సారించండి

## ప్రాజెక్టు జలధార అమలుపై పటిష్ట ప్రణాళిక రూపొందించండి

**నంద్యాల, బ్యూరో ఏప్రిల్ 02 (రిపబ్లిక్ న్యూస్):**
ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాల అమలుపై సానుకూల ప్రజాభిప్రాయం పెంపుదలకు ప్రత్యేక దృష్టి సారించడంతో పాటు, 'ప్రాజెక్టు జలధార' అమలును సమర్థవంతంగా కొనసాగించాలని జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా గురువారం కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాలులో ప్రజా సానుకూలత మరియు ప్రాజెక్టు జలధార అమలుపై అధికారులతో సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, జిల్లాలో సానుకూల ప్రజాభిప్రాయం పెంపుదలపై రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారిస్తోందని ఈ మేరకు ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాల అమలులో ప్రజాసానుకులత పెంపుపై ప్రత్యేక చొరవ చూపాలని అధికారులను ఆదేశించారు. ముఖ్యంగా ఆరోగ్య శాఖలో సెకండరీ హెల్త్ సేవల పరంగా సున్నిపెంట మరియు పరిసర మండలాల్లో వైద్యుల కొరత కారణంగా ప్రజలకు సరైన సేవలు అందడంలో లోపాలు ఉన్నాయని పేర్కొన్నారు. ఈ సమస్యలను తక్షణమే పరిష్కరించాలని సంబంధిత వైద్యాధికారులను ఆదేశించారు. బేతంచర్ల మండలంలో



సరిపడా మరుగుదొడ్లు లేకపోవడం వల్ల ప్రజల నుండి మిశ్రమ స్పందన వస్తోందని పేర్కొంటూ, తగిన మౌలిక వసతులు కల్పించేందుకు వెంటనే చర్యలు తీసుకోవాలని సూచించారు. గ్యాస్ సరఫరాలో అక్రమ వసూళ్లపై కఠిన చర్యలు పౌర సరఫరాల విభాగానికి సంబంధించి బనగానపల్లె మరియు నంద్యాల పట్టణాల్లో గ్యాస్ సిలిండర్ల డెలివరీ సమయంలో నగదు వసూళ్లు జరగకుండా పర్యవేక్షణ పెంచాలని, అక్రమంగా డబ్బులు వసూలు చేసే డెలివరీ సిబ్బందిపై ఆకస్మిక తనిఖీలు నిర్వహించి కఠిన చర్యలు తీసుకోవాలని మున్సిపల్ కమిషనర్‌కు ఆదేశించారు. రిజిస్ట్రేషన్ శాఖలో కార్యాలయాల్లో తెలుగులో బోర్డులు ఏర్పాటు చేయాలని, సేవలు పొందేందుకు వచ్చే ప్రజలతో మర్యాదపూర్వకంగా వ్యవహరించాలని సూచించారు. అలాగే అవుకు, నందికొట్కూరు మండలాల్లో ప్రజా సంతృప్తి తక్కువగా ఉన్నందున ప్రత్యేక చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.

**ప్రాజెక్ట్ జలధారా కింద వాగులు, చెరువులను పునరుద్ధరించండి**

జిల్లాలో భూగర్భ జలాలపై అధిక ఆధారపడటం వల్ల నీటి మట్టాలు పడిపోతున్నాయని, ఈ సమస్యకు పరిష్కారంగా "ప్రాజెక్ట్ జలధారా" కింద వాగుల పునరుద్ధరణ, చెరువుల అభివృద్ధి, చెక్‌డ్యామ్‌లు, రీచార్జ్ నిర్మాణాల ద్వారా నీటిని నిల్వ చేసి భూగర్భ జలాలను పెంచే చర్యలు చేపట్టేందుకు ప్రణాళిక సిద్ధం చేసుకోవాలని జలవనరులు, భూగర్భజల, డ్వామా అధికారులను కలెక్టర్ ఆదేశించారు. జి ఐ ఎస్ సాంకేతికతతో నీటి అధిక, కొరత ప్రాంతాలను గుర్తించి అనుసంధానం చేయాలన్నారు. ప్రజల భాగస్వామ్యంతో ఈ ప్రాజెక్ట్ అమలు చేసి, నీటి మట్టాలు పెరగడం, బోర్లు పునరుద్ధరించేందుకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

# చిన్నారుల పాలిట కల్ప తరువు

## ప్రాథమికదశలోనే లోపాలకు చికిత్స

**అనంతపురం వైద్యం, ఏప్రిల్ 02,(రిపబ్లిక్ న్యూస్):**
పుట్టుకతో వచ్చే సమస్యలు పిల్లల మానసిక, శారీరక ఎదుగుదలపై తీవ్ర ప్రభావం చూపుతాయి. పిల్లల్లో ఆరోగ్య సమస్యలు ఉన్నట్లు చిన్నతనంలోనే గుర్తిస్తేనే వాటిని పూర్తిగా నయం చేయవచ్చని వైద్యులు చెబుతున్నారు డిస్ట్రిక్ట్ ఎర్లీ ఇంటర్వెన్షన్ సెంటర్, ప్రభుత్వ సర్వజన ఆసుపత్రిలో గురువారం భారత శిశు వైద్యుల సంఘం బృందం సమన్వయంతో ప్రపంచ ఆటిజం అవగాహన దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథులుగా జిల్లా వైద్య ఆరోగ్య అధికారి డాక్టర్ ఈ.బి. దేవి, ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ ఎస్.బి. విష్ణుమూర్తి , ప్రభుత్వ ప్రధాన ఆసుపత్రి వైద్యాధికారి డాక్టర్ మల్లేశ్వరి, ఆర్ ఎమ్ ఓ డాక్టర్ హేమలత హాజరయ్యారు.

**పిల్లల ప్రవర్తనలో కనిపించే లక్షణాలు**

ఈ సందర్భంగా డిస్ట్రిక్ట్ ఎర్లీ ఇంటర్వెన్షన్ సెంటర్ సిబ్బంది, శిశు వైద్య విభాగం, మానసిక వైద్య విభాగం వైద్యులు, సిబ్బంది కలిసి తల్లిదండ్రులకు, పిల్లలకు




ఆటిజం గురించి విలువైన అవగాహన కల్పించారు. పిల్లల ప్రవర్తనలో కనిపించే లక్షణాలు, తొలిదశలో గుర్తించే విధానాలు, అవసరమైన చికిత్సలు, ప్రవర్తన మార్పు చికిత్స ప్రాముఖ్యత, తల్లిదండ్రులు ఇంటి వద్ద పాటించాల్సిన సూచనలు వంటి అంశాలను వివరించారు.

ప్రస్తుత విద్యా సంవత్సరంలో డిస్ట్రిక్ట్ ఎర్లీ ఇంటర్వెన్షన్ సెంటర్ ద్వారా సుమారు నూట ఇరవై మంది ఆటిజం పిల్లలను గుర్తించి, వారికి మేధస్సు పరీక్షలు నిర్వహించి, అవసరమైన ప్రవర్తన మార్పు చికిత్స, తల్లిదండ్రుల మార్గదర్శక సలహాలను ఉచితంగా అందిస్తున్నారు. ఈ సేవలను బాల మానసిక నిపుణుడు సుందరరావు సిరిగిరి ద్వారా ప్రతిరోజూ అందిస్తూ, పిల్లల అభివృద్ధికి కృషి చేస్తున్నారు. పిల్లల అభివృద్ధిలో తల్లిదండ్రుల పాత్ర ఎంత ముఖ్యమో తెలియజేస్తూ, వారికి అవసరమైన మానసిక ధైర్యం, మార్గదర్శకత్వాన్ని అందించారు.

**డిఈఐసి సభ్యులందరూ సమష్టి కృషి**

కార్యక్రమం ముగింపు సందర్భంగా హాజరైన ప్రతి చిన్నారికి డిస్ట్రిక్ట్ ఎర్లీ ఇంటర్వెన్షన్ సెంటర్, భారత శిశు వైద్యుల సంఘం తరఫున అవసరమైన విద్యా బొమ్మలు, స్నాక్స్‌ను ఉచితంగా అందజేశారు. ఈ కార్యక్రమం చిన్నారుల్లో ఆనందాన్ని కలిగించడంతో పాటు, తల్లిదండ్రులలో సంతృప్తిని కలిగించింది. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయడంలో ఐఏపి బృందం, పీడియేట్రిక్ ఇంచార్జి హెచ్‌ఓడి డాక్టర్ ప్రవీణ్ దీన్, అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ సంజీవప్ప, పీడియేట్రిక్ డిపార్ట్మెంట్ అందరూ పాల్గొని డిస్ట్రిక్ట్ ఎర్లీ ఇంటర్వెన్షన్ సెంటర్ పీడియాట్రిషన్ డాక్టర్ సాజియా, మెడికల్ ఆఫీసర్ డాక్టర్ హరిదీప్ నాయక్, డెంటిస్ట్ డాక్టర్ ముత్యాలమ్మ, మేనేజర్ రజిత, స్పెషల్ ఎడ్యుకేటర్ చంద్రకళ, ఆప్టోమెట్రిస్ట్ ప్రసన్న, సోషల్ వర్కర్ రాజేశ్వరి, స్టాఫ్ నర్స్ దివ్య మౌనిక లు, ల్యాబ్ టెక్నీషియన్ సురక్షిత, డిఈఐసి సభ్యులందరూ సమష్టిగా సహకరించి తమ వంతు కృషి చేశారు.

# కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రిలో ఏఐ సంచలనం

# 'కార్డియో స్లీవ్' పరీక్షలు విజయవంతం

**కేవలం 30 సెకన్లలో గుండె వైఫల్యాల గుర్తింపు - 93% ఖచ్చితత్వంతో ముందడుగు**

**కర్నూలు ప్రతినిధి (రిపబ్లిక్ న్యూస్ ఏప్రిల్ 2)**
కర్నూలు ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి లో 'రిజువెన్ మెడికేర్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్' సంస్థ రూపొందించిన అత్యాధునిక ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) ఆధారిత 'కార్డియో స్లీవ్' పరికరం వ్యాలిడేషన్ పరీక్షలు విజయవంతంగా పూర్తయ్యాయి. రాష్ట్రంలో అత్యాధునిక వైద్య సేవలను ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలనే లక్ష్యంతో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కీలక చర్యలు చేపడుతోంది. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్, ఆరోగ్య శాఖ కార్యదర్శి సౌరభ్ గౌర్ (ఐ. ఏ. ఎస్) మార్గదర్శకత్వంలో ఈ కార్యక్రమం కొనసాగుతోంది.

రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్ మరియు రాష్ట్ర ఆరోగ్య శాఖ సంయుక్తంగా



నిర్వహించిన 'నేషనల్ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ఛాలెంజ్'లో దేశవ్యాప్తంగా వచ్చిన 300 దరఖాస్తులలో 18 వినూత్న కంపెనీలు ఎంపికయ్యాయి. వాటిలో చోటు దక్కించుకున్న 'రిజువెన్ మెడికేర్' సంస్థకు తమ 'కార్డియో స్లీవ్' పరికరాన్ని కర్నూలు జిజిహెచ్ లో పరీక్షించే అవకాశం లభించింది.

ఈ పరికరం కేవలం 30 సెకన్లలోనే గుండె వైఫల్యాలను గుర్తించి తక్షణ నివేదికలను అందించడం ప్రత్యేకత. పరీక్షలలో ఇది 93% ఖచ్చితత్వాన్ని సాధించడం వైద్య రంగంలో కీలక ముందడుగుగా భావిస్తున్నారు.

ఈ సందర్భంగా ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ కె. వెంకటేశ్వర్లు మాట్లాడుతూ, "రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్ సహకారంతో నిర్వహించిన ఈ పరీక్షలు అత్యంత విజయవంతంగా పూర్తయ్యాయి. అత్యవసర పరిస్థితుల్లో ఇటువంటి ఏఐ సాంకేతికత వల్ల రోగులకు వేగవంతమైన సేవలు అందుతాయి" అని తెలిపారు.

ఈ కార్యక్రమంలో కార్డియాలజీ అసోసియేట్ ప్రొఫెసర్ డా. ప్రశాంత్, అసిస్టెంట్ ప్రొఫెసర్ డా. కె. రవి కిరణ్, రిజువెన్ మెడికేర్ ప్రతినిధులు బాలాజీ లంక, ఉమా మహేష్ కట్టా, కుమారి శాంతి పచ్చిపాల తదితరులు పాల్గొన్నారు

# మాస్టర్స్ క్రీడల్లో మెరిసిన కర్నూలు పోలీస్ క్రీడాకారులు

**బంగారు, వెండి, కాంస్య పతకాలతో ప్రతిభ చాటిన ఆర్‌ఎస్‌ఐ మహేశ్వరరెడ్డి, కానిస్టేబుల్ శివకుమార్**
**ఎస్పీ విక్రాంత్ పాటిల్ అభినందనలు**

**కర్నూలు క్రైమ్ ప్రతినిధి (రిపబ్లిక్ న్యూస్ ఏప్రిల్ 2)**
రాష్ట్రస్థాయి మాస్టర్స్ క్రీడల్లో కర్నూలు జిల్లా పోలీసు శాఖకు చెందిన క్రీడాకారులు అద్భుత ప్రతిభ కనబరిచి పలు పతకాలు సాధించారు. ఈ సందర్భంగా విజేతలను కర్నూలు జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్ ఐపీఎస్ ప్రత్యేకంగా అభినందించారు.

గుంటూరులోని ఆచార్య నాగార్జున యూనివర్సిటీలో మార్చి 30, 31 తేదీలలో నిర్వహించిన ఆంధ్రప్రదేశ్ శాప్ లీగ్ మాస్టర్స్ క్రీడల్లో 3545 ఏళ్ల వయస్సు విభాగంలో ఈ పోటీలు జరిగాయి. ఇందులో ఆర్‌ఎస్‌ఐ పి.ఆర్ మహేశ్వర రెడ్డి, కానిస్టేబుల్ శివకుమార్ పాల్గొని ప్రతిభ చాటారు. ఆర్‌ఎస్‌ఐ మహేశ్వర రెడ్డి 800 మీటర్ల పరుగు పందెంలో బంగారు పతకం, 1500 మీటర్ల పరుగు పందెంలో వెండి



పతకం సాధించారు. గత ఐదేళ్లుగా మాస్టర్స్ అథ్లెటిక్స్‌లో పాల్గొంటూ, చెన్నైలో జరిగిన నేషనల్ మీట్‌లలో కూడా మంచి ప్రదర్శన కనబరిచారు.

కానిస్టేబుల్ శివకుమార్ (కర్నూలు ట్రాఫిక్ పోలీస్ స్టేషన్) లాంగ్ జంప్‌లో కాంస్య పతకం సాధించారు. గతంలో సౌత్ జోన్ నేషనల్స్, కేరళ జూనియర్స్ నేషనల్స్‌తో పాటు రాష్ట్ర, జిల్లా స్థాయి పోటీల్లో కూడా ప్రతిభ చూపారు.

గురువారం జిల్లా పోలీసు కార్యాలయంలో ఈ ఇద్దరు క్రీడాకారులు ఎస్పీని మర్యాదపూర్వకంగా కలవగా, ఆయన మెడల్స్ అందజేసి శాలువాతో సన్మానించారు. విధుల్లో ఒత్తిడిని ఎదుర్కొంటూ క్రీడల్లోనూ రాణించడం గర్వకారణమని, భవిష్యత్తులో జాతీయ, అంతర్జాతీయ స్థాయిల్లో మరిన్ని విజయాలు సాధించాలని ఎస్పీ ఆకాంక్షించారు.

ఈ కార్యక్రమంలో ఆర్ఐ జావేద్, మాస్టర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు పాండురంగారెడ్డి, కార్యదర్శి రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

# రీ సర్వే తప్పులు సరిదిద్ది.. పాసు పుస్తకాలు పంపిణీ

## భోజనం గ్రామంలో పాసు పుస్తకాలు పంపిణీ చేసిన తహసిల్దార్



పాస్ పుస్తకం పంపిణీ చేస్తున్న తహసిల్దార్ పద్మావతి

**బండి ఆత్మకూరు, ఏప్రిల్ 2, (రిపబ్లిక్ న్యూస్):-** మొదటి విడత రీ సర్వే నిర్వహించిన గ్రామాల్లో రెవెన్యూ అధికారులు రైతులకు రాజముద్రతో కూడిన పట్టాదారు పాసు పుస్తకాలు పంపిణీ చేస్తున్నారు. ఇందులో భాగంగా గురువారం మండలంలోని భోజనం గ్రామంలో రెవెన్యూ అధికారులు తహసిల్దార్ పద్మావతి ఆధ్వర్యంలో గ్రామ సభ ఏర్పాటు చేసి రైతులకు పట్టాదారు పాసు పుస్తకాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా తహసిల్దార్ మాట్లాడుతూ రైతులు కొత్త పాసు పుస్తకాలు సరిచూసుకుని ఏవైనా తప్పులు ఉంటే రెవెన్యూ అధికారులకు వినతి పత్రం రూపంలో సమస్య తెలియజేయాలన్నారు. వాటిని పరిశీలించి పరిస్కరిస్తామని తెలిపారు. భోజనం రెవెన్యూ గ్రామంలో సుమారు 933 మంది రైతులకు పట్టాదారు పాసు పుస్తకాలు అందాల్సి ఉండగా 703 మంది రైతులకు పట్టాదారు పాసు పుస్తకాలు మంజూరైనట్లు తహసిల్దార్ తెలిపారు. మిగిలిన వాటిలో జాయింట్ ఎల్పిఎం కలిగి ఉండటం వల్ల 180 ఖాతాలు సరి చేస్తున్నామన్నారు. ఆరుగురు రైతులు మృతి చెందడంతో వారి వారసులకు పాసు పుస్తకాలు మంజూరు చేయడం జరుగుతుందన్నారు. రైతు వారి పట్టా కింద 44 మంది రైతుల వివరాలు తప్పుగా నమోదయ్యాయని తెలిపారు. రీ సర్వే సమయంలో సమయా భావంవల్ల ఆన్లైన్ నమోదులో తప్పులు జరిగిన మాట వాస్తవేమేనన్నారు. కానీ వాటన్నింటినీ సరిదిద్ది త్వరలో వారికి కూడ రాజ ముద్రతో కూడిన పట్టాదారు పాసు పుస్తకాలు పంపిణీ చేయడం జరుగుతుందన్నారు. పాసు పుస్తకాలు అందని రైతులు ఎవరు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని తహసిల్దార్ వివరించారు. అందరికీ పాసు పుస్తకాలు అందిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ అసిస్టెంట్ నరసింహులు,పంచాయతీ కార్యదర్శి చంద్ర నాయక్, వీఆర్వోలు కృష్ణ, నాగేశ్వర రావు,నాగేశ్వరయ్య,తిరుపాలు, రామకృష్ణ, మౌలాలి,స్థానికులు బాలక్రిష్ణ, చాంద్ బాషా,రైతులు తదితరులు పాల్గొన్నారు.

# జాతీయ బోర్డు సభ్యురాలిగా కంసాలి కుసుమలత నియామకం


## ఎన్‌హెచ్‌ఆర్‌ఏసీసీఐ ఫౌండేషన్ నుంచి బాధ్యతలు

## - ప్రజా, మహిళా సమస్యల పరిష్కారానికి కట్టుబడి పనిచేస్తానని హామీ

**కర్నూలు ప్రతినిధి (రిపబ్లిక్ న్యూస్ ఏప్రిల్ 2)**
నేషనల్ హ్యూమన్ రైట్స్ & యాంటీ క్రైమ్ కంట్రోల్ కౌన్సిల్ (ఎన్‌హెచ్‌ఆర్‌ఏసీసీఐ) ఫౌండేషన్ తరపున ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం, కర్నూలు జిల్లాకు చెందిన కంసాలి కుసుమలతను జాతీయ స్థాయి బోర్డు మెంబర్‌గా నియమించారు. ఈ నియామకాన్ని ఢిల్లీ నుంచి సంస్థ జాతీయ అధ్యక్షులు ప్రకటించారు.

ఈ సందర్భంగా కంసాలి కుసుమలత మాట్లాడుతూ, తనపై ఉంచిన విశ్వాసానికి ఫౌండేషన్ ప్రతినిధులకు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. తనకు అప్పగించిన బాధ్యతను నిజాయితీగా నిర్వహిస్తూ సమాజంలో ప్రజా సమస్యలు, ముఖ్యంగా మహిళల సమస్యలపై పోరాడతానని చెప్పారు.

న్యాయం పక్షాన నిలబడి, తన దృష్టికి వచ్చే ప్రతి సమస్యను పరిష్కరించే దిశగా కృషి చేస్తానని ఆమె స్పష్టం చేశారు.



# ఉభయ సభల్లో అమరావతికి చట్టబద్ధత

# నగరపాలక ఉద్యోగుల హర్షం

**కొవ్వొత్తులతో ఆనందోత్సాహం ఆంధ్రులకు గౌరవం దక్కిందన్న అదనపు కమిషనర్**

**కర్నూలు ప్రతినిధి (రిపబ్లిక్ న్యూస్ ఏప్రిల్ 2)**
పార్లమెంట్ ఉభయ సభల్లో రాజధానిగా అమరావతికి చట్టబద్ధత బిల్లు ఆమోదం పొందడంపై నగరపాలక సంస్థ ఉద్యోగులు హర్షం వ్యక్తం చేశారు. గురువారం సాయంత్రం 7 గంటలకు అదనపు కమిషనర్ ఆర్‌జివి కృష్ణ ఆధ్వర్యంలో డిప్యూటీ కమిషనర్ సతీష్ కుమార్‌తో కలిసి ఉద్యోగులు కొవ్వొత్తులు పట్టుకుని ఆనందం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా అదనపు కమిషనర్



మాట్లాడుతూ, అమరావతికి చట్టబద్ధ గుర్తింపు రావడం ఆంధ్రప్రదేశ్ ప్రజలకు దక్కిన గౌరవంగా పేర్కొన్నారు. ఈ నిర్ణయం రాష్ట్ర అభివృద్ధికి దోహదం చేస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో మేనేజర్ చిన్నరాముడు, సూపరింటెండెంట్లు ఇశ్రాయేలు, రామకృష్ణ, సిబ్బంది శ్రీనివాసులు, వీరకుమార్, వినోద్ తదితరులు పాల్గొన్నారు.

# కొన్యాల గ్రామ సభలో రసభస




**హత్నూర :02 ఏప్రిల్ 26( రిపబ్లిక్ న్యూస్)** ఈరోజు జరిగిన కొన్యాల గ్రామసభ రసబసగా సాగింది ముదిరాజ్ బిడ్డగా గెలిచిన నేను ముదిరాజ్ ఫంక్షన్ హాల్ లో గ్రామసభ నిర్వహిస్తానని ఊరంతా సాటిపు చేపించి అక్కడ ముదిరాజ్ ఫంక్షన్ హాల్ లో సభ నిర్వహిస్తానని చేయించిరు కానీ గ్రామ ప్రజలందరూ వ్యతిరేకించడం వల్ల మళ్లీ గ్రామపంచాయతీ దగ్గరనే గ్రామసభ నిర్వహించారు కానీ సభ మాత్రం సజావుగా సాగలేదు వేడివేడిగా నడిచింది గ్రామ ప్రజలు అందరూ సర్పంచిని ఈ గడిచిన నాలుగు నెలల్లో మీరు చేసిన పనులు ఏమిటి అని గ్రామ ప్రజలు సర్పంచిని అడగగా సర్పంచ్ సైలెంట్ గా కూర్చోవడం గమనించాల్సిన విషయం, సర్పంచ్ను పనులు చేయమని అడిగితే ఇది సమస్య ప్రజా సమస్య ప్రజలకు ఉన్న సమస్యలు ఇవి అని సర్పంచ్ ముందట చెబితే సర్పంచ్ కి ముఖ్య అనుచరులుగా భావిస్తున్న కొంతమంది సర్పంచి కన్న ముందు వాళ్లే సమాధానాలు చెప్తున్నారు మీరు కాదు చెప్పేది సర్పంచ్ చెప్పాలి జవాబులు అని గ్రామస్తులు ఆందోళన చేయగా సర్పంచ్ కాదు చెప్పేది సమాధానాలు మేమే చెప్తాము అని కొంతమంది ముఖ్య అనుచరులు చెప్పుకొచ్చారు దీనిబట్టి సర్పంచ్ వాళ్లు ముందే మాట్లాడుకొని ఈ విధంగా మాట్లాడాలి గ్రామస్తులను మభ్య పెట్టాలి అని సభలోకి వచ్చారు కాంగ్రెస్ పార్టీ ప్రజా పాలన అని ఆరు గారెంటీలు ఇచ్చి ప్రజలను మభ్యపెడుతున్నారు అని గ్రామస్తులు వ్యతిరేకాన్ని వ్యక్తపరిచారు

## గ్రామపంచాయతీలకు ప్రత్యేక అధికారులు నియామకం

**బండి ఆత్మకూరు, ఏప్రిల్ 2, (రిపబ్లిక్ న్యూస్ ).** ;- గ్రామ పంచాయతీలకు సర్పంచులుగా ఎన్నికైన అభ్యర్థుల పదవి సమయం ముగియడంతో గ్రామ పంచాయతీ పరిపాలన వ్యవహారాల కోసం జిల్లా కలెక్టర్ రాజకుమారి గనియ గురువారంప్రత్యేక అధికారులను నియమించడం జరిగింది .1. తహసిల్దార్ పద్మావతమ్మ.బి బండి ఆత్మకూర్, రామాపురం, సంత జుటూరు.,2. ఎంపీడీవో గాయత్రిబికడమల కాలువ,ఈర్నపాడు,బి.కోడూరు.,పశు వైద్యురాలు డాక్టర్ అనుషబిఎర్రగుంట్ల,ఏ.కోడూరు,4. పశువైద్యాలు జోష్ణబిపార్నపల్లి,కాకనూరు,5..డిప్యూటీ ఎంపీడీవో పురుషోత్తంబిజి లింగాపురం చిన్నదేవలాపురం, నారాయణపురం. 6. డిప్యూటీ ఎంపీడీవో చంద్రమౌళిబివెంగల్ రెడ్డి పేట, జిసి పాలెం.
7. ఎం .ఏ .ఓ. పవన్ కుమార్బిపరమటూరు, భోజనం, పెద్దదేవలాపురం..8. ఎం.ఈ.ఓ. యశోదబిసింగవరం సోమయాజుల పల్లె మండలంలోని అన్ని గ్రామ పంచాయతీలకు ప్రత్యేక అధికారులుగా నియమించినట్లు ఎంపీడీవో గాయత్రి తెలిపారు

## పోలీసుల కట్టుదిట్టమైన బందోబస్తు

### డ్రోన్లు, సీసీ కెమెరాలతో నిఘా -ఎస్పీ ఆదేశాలతో భారీ భద్రతా ఏర్పాట్లు

### ప్రశాంతంగా ముగిసిన రథోత్సవాలు

**రిపబ్లిక్ క్రైమ్, ఏప్రిల్ 02, అనంతపురం**
జిల్లాలో పోలీసుల కట్టుదిట్టమైన బందోబస్తు ఏర్పాటు చేయడంతో వివిధ ప్రాంతాలలో జరిగిన రథోత్సవాలు గురువారం ప్రశాంతంగా ముగిశాయి. జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు పలు గ్రామాలు, ప్రాంతాల్లో పోలీసులు భారీ భద్రతా ఏర్పాట్లు చేపట్టి ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా ముందస్తు చర్యలు తీసుకున్నారు.



**జనసంచారం ఉండే ప్రాంతాల్లో ప్రత్యేక పహారా**
కూడేరు సంగమేశ్వర స్వామి, హావళిగి జంబుకేశ్వర స్వామి, రాకెట్ల సుంకులాంబ దేవాలయాలలో జరిగిన రథోత్సవాలకు అధిక సంఖ్యలో భక్తులు తరలి వచ్చారు. దీంతో రథోత్సవ మార్గాల్లో పోలీసులు ప్రత్యేక బందోబస్తు ఏర్పాటు చేసి ట్రాఫిక్ నియంత్రణ చేపట్టారు. జనసంచారం ఎక్కువగా ఉండే ప్రాంతాల్లో ప్రత్యేక పహారా నిర్వహించారు.భద్రతా చర్యల్లో భాగంగా డ్రోన్లు ఎగురవేసి నిఘా ఉంచారు. సీసీ కెమెరాల పర్యవేక్షణ, మొబైల్ పెట్రోలింగ్ ద్వారా భద్రతను మరింత బలోపేతం చేశారు.ప్రధాన కూడళ్లు, రథోత్సవ మార్గాల్లో అదనపు పోలీసు బలగాలను మోహరించారు.భక్తులు, స్థానిక ప్రజలు పోలీసుల సూచనలు పాటిస్తూ సహకరించడంతో రథోత్సవాలు ఎలాంటి అంతరాయం లేకుండా విజయవంతంగా పూర్తయ్యాయి.

## ప్రగతి పాలన ప్రజాపాలన.

### 8 వ వార్డు కౌన్సిలర్ అభ్యర్థి రాచకొండ నాగరత్నం గౌడ్

**అందోల్ నియోజకవర్గం ప్రతినిధి ఏప్రిల్ 2 ప్రజా రిపబ్లిక్ న్యూస్**
అందోల్ జోగిపేట మున్సిపాలిటీ పరిధిలో ఉన్న 8వ వార్డులో ప్రగతిపాలన ప్రజా పాలన భాగంగా 99 ప్రణాళికల భాగంగా వార్డులో సమావేశం ఏర్పాటు చేశారు. వార్డు సమస్యలు, ఇందిరమ్మ ఇల్లు, పెన్షన్, రేషన్ కార్డు, రైతు భరోసా, పలు పథకాల కౌన్సిలర్ రాచకొండ నాగరత్నం గౌడ్ తెలిపారు. ఈ కార్యక్రమంలో వార్డు ప్రజలు తదితరులు పాల్గొన్నారు.




## ప్రగతి పాలన ప్రజాపాలన.

### 6వ వార్డు కౌన్సిలర్ అభ్యర్థి రాచకొండ జ్యోతి ప్రదీప్ గౌడ్

**అందోల్ నియోజకవర్గం ప్రతినిధి ఏప్రిల్ 2 ప్రజా రిపబ్లిక్ న్యూస్**
అందోల్ జోగిపేట మున్సిపాలిటీ పరిధిలో ఉన్న 6వ వార్డులో ప్రగతిపాలన ప్రజా పాలన భాగంగా 99 ప్రణాళికల భాగంగా వార్డులో సమావేశం ఏర్పాటు చేశారు. వార్డు సమస్యలు, ఇందిరమ్మ ఇల్లు, పెన్షన్, రేషన్ కార్డు, రైతు భరోసా, పలు పథకాల కౌన్సిలర్ రాచకొండ జ్యోతి ప్రదీప్ గౌడ్ తెలిపారు. ఈ కార్యక్రమంలో వార్డు ప్రజలు తదితరులు పాల్గొన్నారు.



## సుప్రీం కోర్టు తీర్పును వ్యతిరేకించిన బహుజన సమాజ్ పార్టీ



**గుత్తి ఏప్రిల్ 02 (రిపబ్లిక్ న్యూస్)**గుత్తి పట్టణంలోని బహుజన్ సమాజ్ పార్టీ ఆధ్వర్యంలో మార్చి 24వ తారీఖున ఎస్సీలు క్రిస్టియన్ మతంలోకి మారితే ఎస్సీల హోదా రద్దు అవుతుంది అని సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పుకు వ్యతిరేకంగా మరియు పశ్చిమగోదావరి జిల్లా ఉండి నియోజకవర్గం ఆకివీడులో రాష్ట్ర ఉప సభాపతి హోదాలో ఉంటూ మత ఘర్షణలు రెచ్చగొట్టిన రఘురామకృష్ణం రాజును పదవి నుండి తొలగించాలని డిమాండ్ చేస్తూ నిరసన ఈ కార్యక్రమంలో చర్చి పాస్టర్ తో పాటు బీసీ సంఘాల నాయకులకు కూడా పాల్గొని మద్దతు తెలిపారు. బహుజన్ సమాజ్ పార్టీ రాష్ట్ర కార్యదర్శి రాయలసీమ జోన్ ఇంచార్జ్ గద్దల నాగభూషణం మాట్లాడుతూ సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు రాజ్యాంగ విరుద్ధమని తెలిపారు రాజ్యాంగంలో ఆర్టికల్ 14, 15 ప్రకారం చట్టం ముందు అందరూ సమానమే అన్న భావన ఈ తీర్పునకు విరుద్ధమని అలాగే ఆర్టికల్ 25 ప్రకారం భారతదేశ పౌరులు తమకు ఇష్టం వచ్చిన మతం అనుసరించవచ్చని అలాగే ప్రచారం చేసుకోవచ్చని తెలియజేస్తుందని తెలిపారు కాబట్టి సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు రాజ్యాంగ విరుద్ధంగా భావించాల్సి వస్తుందని అభిప్రాయపడ్డారు మరియు గుంతకల్ నియోజకవర్గం అధ్యక్షులు విజయ్ మాట్లాడుతూ క్రిస్టియన్ మతంలోకి ఓసి లు కూడా మారుతున్నారని వారికి మాత్రం ఈ డబ్ల్యు ఎస్ కింద పది పర్సెంట్ రిజర్వేషన్స్ ఎలా అమలు చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు ఓసీలు బీసీలు క్రిస్టియన్ మతంలోకి మారినప్పుడు వారి కులం కూడా మారాలి అని ప్రశ్నించారు అలాగే పాస్టర్ అసోసియేషన్ నాయకులు మ్యాథ్యూ మరియు అనిల్ మాట్లాడుతూ పశ్చిమ గోదావరి జిల్లా ఉండి నియోజకవర్గం ఆకివీడులో క్రిస్టియన్ మాల కమ్యూనిటీ ఉన్న వీధిలోకి వెళ్లి ఉద్దేశపూర్వకంగా రామాలయం నిర్మిస్తానని మత ఘర్షణలో రెచ్చగొట్టడం క్షమించరాని నేరమని రాజ్యాంగ హోదా పదవిలో ఉంటూ ఇలాంటి చిల్లర విషయాల్లో ముందు ఉండటం అతని హోదాకు తగదని ఆక్షేపించారు ఈ కార్యక్రమంలో బహుజన్ సమాజ్ పార్టీ గుంటకల్ నియోజకవర్గం కన్వీనర్ బి వెంకట కొండయ్య బండల రామాంజనేయులు సుధాకర్ కృష్ణా రంగయ్య రంగమ్మ ఓబులేసు పాస్టర్స్ అసోసియేషన్ నాయకులు బిసి సంఘం నాయకులు పాల్గొన్నారు

## ఐదు కోట్ల ఆంధ్రుల గుండెలు చప్పుడు అమరావతి

### రాష్ట్ర కార్మిక సంక్షేమ శాఖ బోర్డు చైర్మన్ వెంకట శివుడు యాదవ్

**గుత్తి ఏప్రిల్ 02 (రిపబ్లిక్ న్యూస్)**
ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి అమరావతి రాజధానిగా ప్రకటించిన నేపథ్యంలో రాష్ట్ర కార్మిక సంక్షేమ శాఖ బోర్డు చైర్మన్ వెంకట శివుడు యాదవ్ ఆధ్వర్యంలో గుత్తి పట్టణం తన కార్యాలయం నందు గురువారం కూటమి నాయకులతో కలసి బాణాసంచా కాల్చి , కేక్ కటింగ్ చేసి పెద్ద ఎత్తున సంబరాలు చేసుకోవడం జరిగింది..
ఈ సందర్భంగా వెంకట శివుడు యాదవ్ మాట్లాడుతూ,
ముందుగా ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ కి , ఆంధ్ర రాష్ట్రం ముఖ్యమంత్రినారా చంద్రబాబు కి డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ కి మంత్రి లోకేష్ కి ప్రత్యేక ధన్యవాదములు తెలిపారు .అమరావతి అనేది కేవలం ఒక నగరం కాదని ఇది ఐదు కోట్ల ఆంధ్రుల గుండెచప్పుడు అని ఆయన పేర్కొన్నారు. చంద్రబాబు నాయుడు అనే ఒకే ఒక నాయకుడి పిలుపుతో రైతులు తమ 33 వేల ఎకరాల విలువైన భూములను రాజధాని కోసం స్వచ్ఛందంగా త్యాగం చేశారని గుర్తు చేశారు. 2019లో అధికారంలోకి



వచ్చిన వైసిపి ప్రభుత్వం అమరావతిని సర్వనాశనం చేసిందని ఇప్పుడు మావిగన్ అనే వింత పేరుతో కొత్త నాటకాలు తెరలేపిందని మండిపడ్డారు .దేశంలోనీ 40 రాజకీయ పార్టీలు అమరావతి మద్దతు తెలుపుతుంటే ఒక వైసీపీ మాత్రమే రాష్ట్ర అభివృద్ధికి శాపంలా మారి అడ్డుపడడం వైసీపీ ప్రభుత్వానికి సిగ్గుచేటు అని తెలపడం జరిగిందిఈ విజయం అమరావతి రైతుల అలుపెరగని ఉద్యమనికి దక్కిన గౌరమని తెలపడం జరిగింది.
అమరావతి పట్ల ప్రజల విశ్వాసాన్ని, రాష్ట్ర అభివృద్ధి పట్ల ఉన్న ఆకాంక్షను ప్రతిబింబించాయి.
అమరావతి రాజధానిగా అభివృద్ధి చెందడం ద్వారా ఆంధ్రప్రదేశ్‌కు ఆర్థికంగా, పారిశ్రామికంగా, సాంస్కృతికంగా కొత్త దిశలో ముందుకు వెళ్లే అవకాశాలు విస్తృతంగా ఉన్నాయని తెలపడం జరిగింది
కేంద్ర ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయం రాష్ట్ర భవిష్యత్తుకు మార్గదర్శకంగా నిలుస్తుందని, అమరావతి దేశంలోనే ఒక ప్రముఖ నగరంగా ఉంటుందని తెలియజేశారుఈ కార్యక్రమంలో రాష్ట్ర కిషన్ మోర్చా జోనల్ ఇంచార్జి తెగదొడ్డి తిమ్మారెడ్డి , జనసేన టౌన్ అధ్యక్షుడు పాటిల్ సురేష్ ,ఉపాధ్యక్షులు వెంకటపతి , టిడిపి మాజీ టౌన్ అధ్యక్షులు నరేంద్ర చౌదరి , టిడిపి సీనియర్ నాయకులు రవితేజ , 17 వ వార్డు ఇంచార్జ్ టైలర్ భాషా , పెద్దొడ్డి శివ , పరశురాం , , రమణ , చాంద్ భాషా , రాహుల్ , శేఖర్ , అది శేషు ,రామాంజీ ఆచారి, మద్దిలేటి , అంజి కూటమి నాయకులు కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొనడం జరిగింది....

## ప్రభుత్వాలు దేవాలయ మాన్యములకు కాపలాధారే తప్ప హక్కుదారు కాదు

**బనగానపల్లి**
బనగానపల్లి మండలం భానుముక్కల గ్రామంలోని శ్రీ వెంకటేశ్వర స్వామి దేవాలయ దేవాలయానికి చెందిన దాదాపు 35 ఎకరాల మాన్యమును ప్రజలకు పంచిపెట్టే విధంగా ప్రభుత్వం ఆలోచిస్తున్నట్టుగా మంత్రివర్యులు బీసీజనార్దన్ రెడ్డి యొక్క మాటలు స్పష్టం చేస్తున్నాయి. ఈ భూముల పంపిణీకి సంబంధించిన పూజా కార్యక్రమాలు కూడా జరిగాయి. ఈ సందర్భంగా నంద్యాల జిల్లా విశ్వ హిందూ పరిషత్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ప్రెస్ మీట్ కార్యక్రమంలో విశ్వహిందూ పరిషత్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎర్రం విష్ణువర్ధన్ గారు మాట్లాడుతూ.....
పేద ప్రజలకు ఇళ్ల పట్టాలు ఇవ్వటం విశ్వ హిందూ పరిషత్ స్వాగతిస్తుంది. అయితే అవి దేవాలయ మాన్యాలు ఇస్తే కచ్చితంగా ఖండిస్తుంది.అవసరమైతే ప్రజా




పోరాటం,న్యాయపోరాటం చేయడానికి సిద్ధం అని తెలిపారు. ఈ దేవాలయ భూముల పంపిణీ విషయంలో విశ్వ హిందూ పరిషత్ అభ్యంతరాలను కలెక్టర్ గారికి, ఎండోమెంట్ డీఈవో గారికి వినతిపత్రంతో తెలియజేస్తామని తెలిపారు. విశ్వ హిందూ పరిషత్ నంద్యాల జిల్లా అధ్యక్షుడు బుగ్గన చంద్రమౌళీశ్వర్ రెడ్డి మాట్లాడుతూ ఈ విధంగా దేవాలయ మాన్యాలను పంచుకుంటూ, ప్రత్యామ్నాయ స్థలాలు ఇచ్చుకుంటూ వెళితే ఏదో ఒక రోజున దేవాలయ వ్యవస్థ కుంటుపడటం తప్పదు.దేవాలయ వ్యవస్థ యధాతరంగా ఉండాలంటే ఆ యొక్క మాన్యముల పరిరక్షణ పకడ్బందీగా ఉండాలి. అంతేగాని ప్రభుత్వ అవసరాలకు దేవుడి విలువైన మాన్యాలను ఇవ్వడం సరైనది కాదని తెలిపారు.దేవాలయ భూములను రక్షించాల్సిన ప్రభుత్వాలే ఈ విధంగా దేవాలయ భూములను ఇవ్వడం సరైనది కాదన్నారు. నంద్యాల జిల్లా విశేష సంపర్క ప్రముఖ కాల్వ శేష సాయి గారు మాట్లాడుతూ గతంలో దేవాలయ భూములను ఈ విధంగా అన్యాక్రాంతం చేయాలని చూస్తే ఇది తప్పు అని కోర్టు తీర్పులు కూడా వచ్చాయి అన్నారు. ఈ కార్యక్రమంలో విశ్వహిందూ పరిషత్ జిల్లా ఉపాధ్యక్షుడు నాగిరెడ్డి గారు పాల్గొన్నారు.

## చిన్నారుల పంచ్‌తో పతకాల వర్షం

### పోటీల్లో 6 బంగారు,8 వెండి,6 కాంస్య పతకాల ప్రతిభ -దక్షిణ భారతంలో సత్తా చాటిన గ్రామీణ విద్యార్థులు

**రిపబ్లిక్ స్పోర్ట్స్, ఏప్రిల్ 02, ధర్మవరం, శ్రీ సత్య సాయి**
ఆర్థిక ఇబ్బందులుడ సరైన సదుపాయాల లేమిడ అయినా ఆగని పట్టుదల. ధర్మవరం ప్రాంతానికి చెందిన చిన్నారులు కరాటే వేదికపై తమ ప్రతిభతో మెరిసి 20 పతకాలు సాధించారు. అనంతపురంలో జరిగిన దక్షిణ భారత స్థాయి కరాటే పోటీల్లో సిరిపి వెంకటేష్ కరాటే అకాడమీకి చెందిన విద్యార్థులు అద్భుత ప్రదర్శనతో విజేతలుగా నిలిచారు. గ్రామీణ నేపథ్యం నుంచి వచ్చిన ఈ క్రీడాకారులు చదువుతో పాటు రోజూ కఠిన సాధన చేస్తూ విజయాన్ని సాధించారు. కొందరు విద్యార్థులు ఉదయం పనులు చేసి, సాయంత్రం శిక్షణ పొందుతూ తమ కలలను సహకారం చేసుకున్నారు. అందులో భాగంగా తల్లిదండ్రుల ఆర్థిక పరిస్థితులు అనుకూలంగా లేకపోయినా, పిల్లల పట్టుదలతో క్రీడలలో అద్భుత ప్రదర్శన ఇచ్చి 6 బంగారు, 8 వెండి, 6 కాంస్య పథకాలు సాధించారు.

**బంగారు పతక విజేతలు :**
వేదశ్రీ, బి.హేమంత్, పునీత్, ప్రణవి, శశాంక్, లోకేశ్



**వెండి పతక విజేతలు:**
లాస్య, వేదశ్రీ, సోను, వరుణ్, ఉజ్వల్, కుశాల్, వంశీకృష్ణ, చందన

**కాంస్య పతక విజేతలు:**
ఆదిత్య, వంశీకృష్ణ, భరత్, బాంధవ్య, మోక్ష ప్రియ, బి.హేమంత్ కుమార్

**కోచ్ విజయ రహస్యం**
ధర్మవరం ప్రాంతంలో కరాటే క్రీడను ప్రోత్సహిస్తూ విద్యార్థులను రాష్ట్ర, జాతీయ స్థాయికి తీసుకెళ్లాలనే లక్ష్యంతో సిరిపి వెంకటేష్ కరాటే అకాడమీ పనిచేస్తోంది. సరైన మైదానం, సదుపాయాలు లేకపోయినా పట్టుదలతో విద్యార్థులకు శిక్షణ ఇస్తూ వారిని విజేతలుగా తీర్చిదిద్దుతున్నారు. క్రమశిక్షణ, ఫిట్‌నెస్, ధైర్యం ఈ మూడు ఉంటే క్రీడల్లో ఎవరైనా విజయం సాధించవచ్చని కోచ్ చెబుతున్నారు.
ఈ సందర్భంగా కరాటే లో శిక్షణ ఇచ్చిన గురువు సంతోషం వ్యక్తపరిచారు. హరీష్ బాబు గురువారం పథకాలు సాధించిన విజేతలను హరీష్ బాబు సత్కరించారు. అనంతరం విద్యార్థులకు ప్రశంస పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా హరీష్ బాబు మాట్లాడుతూ చిన్నారులు సాధించిన విజయం తనకు ఎంతో ప్రేరణ ఇచ్చిందన్నారు.
గ్రామీణ ప్రాంతాల నుంచి వచ్చిన విద్యార్థులు రాష్ట్ర, జాతీయస్థాయిలో ప్రతిభ చాటడం ఎంతో ఆనందకరమని తెలిపారు.క్రీడలు మానసిక ఉల్లాసాన్ని కలిగిస్తాయని వాటితో పాటు జీవితాన్ని మార్చే శక్తి క్రీడలకు ఉందని పేర్కొన్నారు.అనంతరం క్రీడాకారులకు పుస్తకాలు, స్టేషనరీ అందజేసి ప్రోత్సహించారు.

## హాండ్స్ స్వచ్ఛంద సంస్థ రైతులకు అభివృద్ధి బాట

**గుత్తి ఏప్రిల్ 02 (రిపబ్లిక్ న్యూస్)**
గుత్తి మండల పరిధిలో హ్యాండ్స్ (మానవ మరియు సహజ వనరుల అభివృద్ధి సంస్థ) ఆధ్వర్యంలో, సేట్రీస్ పర్యావరణ ట్రస్ట్ సహకారంతో అమలు చేస్తున్న ఆగ్రోఫారెస్ట్రీ ప్లాంటేషన్ కార్యక్రమంపై సంస్థ ప్రతినిధులు గురువారం. మీడియా సమావేశం నిర్వహించి పూర్తి వివరాలు వెల్లడించారు. ఈ సందర్భంగా పిడి నారాయణస్వామి, మాట్లాడుతూ, ఆగ్రోఫారెస్ట్రీ అనేది వ్యవసాయం, అటవీ మరియు పశుసంవర్ధకాన్ని సమన్వయం చేసే సమగ్ర వ్యవసాయ విధానమని, ఈ విధానం ద్వారా రైతులు ఒకే భూమిలో పంటలు, చెట్లు మరియు పశుసంవర్ధకాన్ని కలిపి సాగు చేయగలరని, దీని వల్ల సుస్థిర వ్యవసాయం సాధ్యమవుతుందని తెలిపారు. అడవి మొక్కలు పూర్తిగా ప్రకృతిపై ఆధారపడి పెరుగుతాయని, వ్యవసాయ పంటలు రైతు అందించే నీరు, ఎరువులు మరియు సంరక్షణపై ఆధారపడి నిరంతరంగా పంట ఇస్తాయని వివరించారు. ఈ కార్యక్రమంలో భాగంగా పొలం గట్ల వెంబడి మహాగని, ఎర్రచందనం మరియు టెంకాయ మొక్కలను నాటాలని సూచిస్తూ, మహాగని చెట్లు 10 నుండి 15 సంవత్సరాల్లో, ఎర్రచందనం చెట్లు 20 నుండి 25 సంవత్సరాల్లో ఆదాయాన్ని అందిస్తాయని, టెంకాయ చెట్లు 4 నుండి 5 సంవత్సరాల్లో పంటకు వచ్చి రైతులకు అదనపు ఆదాయం కల్పిస్తాయని తెలిపారు. గట్ల వెంబడి కలప చెట్లు నాటడం వల్ల పొలంలో ఉష్ణోగ్రత తగ్గి పంటలకు రక్షణ లభించడంతో పాటు గాలివానల ప్రభావం తగ్గి పంటలు రాలిపోకుండా కాపాడుతాయని, అలాగే చీడపీడల ప్రభావం కూడా తగ్గుతుందని వివరించారు. ప్రధాన







భూమిలో మామిడి, నేరేడు, సపోటా వంటి పండ్ల చెట్లు నాటుకోవాలని సూచిస్తూ, ఇవి తక్కువ నీటితో కూడాను పెరుగుతాయని, చీని, నిమ్మ వంటి పంటలు ఎక్కువ నీరు అవసరమవుతాయని, నీటి వనరులు ఉన్న రైతులు మాత్రమే వాటిని ఎంచుకోవాలని సూచించారు. పండ్ల చెట్ల మధ్య అంతర పంటలు సాగు చేయడం ద్వారా రైతులు తాత్కాలిక ఆదాయం పొందవచ్చని, ఈ విధానం భూమి సారాన్ని పెంచి ప్రధాన పంటలకు ఉపయోగపడుతుందని, మొదటి మూడు సంవత్సరాలు అంతర పంటలు సాగు చేసి నాల్గవ సంవత్సరం నుండి పండ్ల దిగుబడి పొందవచ్చని తెలిపారు. ఇదే సమయంలో గుత్తి మండలంలోని పలు గ్రామాలకు చెందిన రైతులు ఈ కార్యక్రమంపై సంతోషం వ్యక్తం చేస్తూ, హ్యాండ్స్ సంస్థ అందించిన చెట్ల మొక్కల ద్వారా తమ పంటలు లాభదాయకంగా మారాయని, బోర్లు లేని రైతులకు వేస్ట్ వంకాలు మరియు వర్షపు నీటిని పైప్‌లైన్ ద్వారా వినియోగించుకునే విధంగా సహాయం అందించడంతో నీటి కొరత ఉన్న ప్రాంతాల్లో కూడా సాగు సాధ్యమైందని తెలిపారు. హ్యాండ్స్ సంస్థ గుత్తి మండలంలో ఉండడం తమకు అండగా, తోడు నీడగా ఉందని, రైతుల అభివృద్ధి కోసం నిజాయితీగా కృషి చేస్తున్న సంస్థగా ప్రశంసించారు. సంస్థ కార్యకలాపాలు పూర్తిగా చట్టబద్ధంగా కొనసాగుతున్నాయని, అన్ని ఆర్థిక వ్యవహారాలు పారదర్శకంగా నిర్వహించబడుతున్నాయని స్పష్టం చేస్తూ, రైతుల ప్రయోజనాల కోసమే ఈ కార్యక్రమం అమలు అవుతుందని తెలిపారు. ఇటీవల కొంతమంది వ్యక్తులు ఈ కార్యక్రమంపై అసత్య ప్రచారాలు చేయడం గమనార్హమని పేర్కొంటూ, ప్రజలను తప్పుదారి పట్టించే ఇలాంటి చర్యలను తీవ్రంగా ఖండించారు. అసత్య ఆరోపణలు, అపవాదాలు చేస్తే సంబంధిత వ్యక్తులపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని, సంస్థ ప్రతిష్టను దెబ్బతీయడానికి చేసే ప్రయత్నాలను ఎట్టి పరిస్థితుల్లో సహించబోమని గట్టిగా హెచ్చరించారు. ప్రజలు, రైతులు వాస్తవాలను తెలుసుకుని మాత్రమే స్పందించాలని కోరుతూ, ఎవరైనా సందేహాలు ఉంటే అధికారికంగా సంస్థను సంప్రదించవచ్చని, తెలియజేశారు.రైతుల ఆర్థికాభివృద్ధి, పర్యావరణ పరిరక్షణ మరియు భవిష్యత్ తరాలకు భరోసా కల్పించడం ఈ కార్యక్రమ ప్రధాన లక్ష్యమని హ్యాండ్స్ సంస్థ వెల్లడించింది.

# పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేయించాలి




**మల్లాపూర్ ఏప్రిల్ 2 (రిపబ్లిక్ న్యూస్)**
పశు పోషకులు తమ పశువులకు తప్పనిసరిగా గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేయించాలని మల్లాపూర్ మండల రేగుంట గ్రామ సర్పంచ్ తీట్ల లహరి రాజేష్ అన్నారు. గురువారం మండల పరిధిలోని రేగుంట గ్రామంలో గాలికుంటు వ్యాధి నివారణ టీకాల కార్యక్రమాన్ని ప్రారంభించి మాట్లాడారు. పశువుల్లో గాలికుంటు వ్యాధి సోకితే పాల ఉత్పత్తి తగ్గుతుందన్నారు. ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ సందర్భంగా గ్రామంలో పశువులకు టీకాలు వేయించడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో పశు వైద్యాధికారి డాక్టర్ ఇక్బాల్, ఉప సర్పంచ్ గనవేని నందిని మల్లేష్ పాడి రైతులు పాల్గొన్నారు.

# రాఘవపేటలో పలు సమస్యలను గ్రామ సభ దృష్టికి తీసుకెళ్లిన నాయకులు



**మల్లాపూర్ ఏప్రిల్ 2 ( రిపబ్లిక్ న్యూస్ )**మల్లాపూర్ మండలంలోని రాఘవపేట గ్రామంలో రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు సర్పంచ్ తోట శ్రీనివాస్ గారి అధ్యక్షతన గ్రామ సభ నిర్వహించగా అధికారుల దృష్టికి పలువురు నాయకులు గ్రామంలో నెలకొన్న ప్రధాన సమస్య ప్రజా పాలన దరఖాస్తులు ఆన్లైన్ చేయకపోవడంతో సుమారు 200 కుటుంబాలకు గృహ జ్యోతి, రుణమాఫీ, ఉచిత గ్యాస్ పొయ్యి, ప్రతి మహిళకు పింఛన్లతో పాటు ఇంకా కొంత మంది లబ్దిదారులకు ఇందిరమ్మ ఇండ్లతో పాటు ఇటీవల కురిసిన అకాల వర్షాలకు పంటలు నష్టపోయిన రైతులకు నష్టపరిహారం అందేలా అధికారులు కృషి చేయాలని వినతి పత్రం అందించారు.ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ మద్దెల నర్సయ్య, వార్డ్ సభ్యులు దాసరి భారతి,ఇడగొట్టి లసమయ్యా,అమీన్,అడపా హారిక, గురిజెలా మాధురి, మాదం సాగర్, మామిడి లక్ష్మీ నర్సయ్య, నాయకులు భైరి రవికుమార్ యాదవ్, రాకేష్ యాదవ్, మద్దెల స్వామి, బండి కమలాకర్ తదితరులు పాల్గొన్నారు.

# సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ ఆశయాలు

## యువతకు ఆదర్శం :అదనపు కలెక్టర్ నగేష్



**మెదక్ జిల్లా ప్రతినిధి ఏప్రిల్ 2( ప్రజా రిపబ్లిక్ న్యూస్ )**కలం, సామాజిక సమానత్వం, న్యాయంకోసం పోరాడిన వీర యోధుడు సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ జీవితం నేటి యువతకు స్ఫూర్తిదాయకమని అదనపు కలెక్టర్ నగేష్ తెలిపారు. గురువారం జిల్లా సమీకృత కలెక్టరేట్ కార్యాలయంలో బీసీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఆధ్వర్యంలో నిర్వహించిన సర్వాయి పాపన్న గౌడ్ వర్ధంతివేడుకల్లో అదనపు కలెక్టర్ నగేష్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ వర్ధంతి కార్యక్రమాన్ని పాపన్న గౌడ్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. సమాజంలో అణచివేతకు వ్యతిరేకంగా పాపన్న గౌడ్ చేసిన పోరాటం చిరస్మరణీయమని తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ వర్ధంతి కార్యక్రమంలో గౌడ సంఘం అధ్యక్షుడు మంగా రమేష్ గౌడ్, రేణుక ఎల్లమ్మ ఆలయం అభివృద్ధి కమిటీ చైర్మన్ విధ్యాధర్ గౌడ్, సంఘ నాయకులు నర్సింహులు గౌడ్, సురేందర్ గౌడ్, నాగరాజు గౌడ్, యాదగిరి గౌడ్, శంకర్ గౌడ్, కుమార్ గౌడ్ సహాయ వెనుక బడిన తరగతుల అభివృద్ధి అధికారి గంగా కిషన్, కార్యాలయ సిబ్బంది శ్రీనివాస్,లవన్, భాను ప్రకాష్,ఆరీఫ్, నర్సింహులు,సిద్ధరాములు, తదితరులు పాల్గొన్నారు.

# ప్రగతి పాలన ప్రజాపాలన.

## 10వ వార్డు కౌన్సిలర్ పట్లోల్ల రేఖ ప్రవీణ్.



**ఆందోల్ తినిధి ఏప్రిల్ 2 ప్రజా రిపబ్లిక్ న్యూస్**
అందోల్ జోగిపేట మున్సిపాలిటీ పరిధిలో ఉన్న 10వ వార్డులో ప్రగతిపాలన ప్రజా పాలన భాగంగా 99 ప్రణాళికల భాగంగా వార్డులో సమావేశం ఏర్పాటు చేశారు. వార్డు సమస్యలు, ఇందిరమ్మ ఇల్లు, పెన్షన్, రేషన్ కార్డు, రైతు భరోసా, పలు పథకాల కౌన్సిలర్ పట్లోల్ల రేఖ ప్రవీణ్ తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వార్డ్ ఆఫీసర్ అంజన్న, సబిత, ఆత్మ కమిటీ డైరెక్టర్ చిట్యాల మధు, మాజీ కౌన్సిలర్ తుపాకుల సునీల్ కుమార్, కుమ్మరి సుధాకర్, తుపాకు లక్ష్మణ్, ఆకుల నాగేష్, మోదిని రాజు, వడ్ల మానేయ్యా, సాయి, రమేష్, మురళి, మహేష్, భాస్కర్, గుర్రపు కృష్ణ, కూర మల్లేశం, వార్డు మహిళలు, తదితరులు పాల్గొన్నారు.

# చేగుంట మండలం వడియారం గ్రామం ఆదర్శ గ్రామపంచాయతీగా తీర్చిదిద్దాలి

**క్షేత్రస్థాయిలో ప్రజల సమస్యలను పరిష్కరించడంలో, సంక్షేమ పథకాలను పారదర్శకంగా అమలుకే గ్రామసభలు.**

**ప్రజల భాగస్వామ్యం, అవసరాలను గుర్తించి, సత్వర పరిష్కారానికి అధికారులు గ్రామ బాట**

**గ్రామ స్థాయిలో పాలన పారదర్శకంగా ఉండాలనే పటిష్టంగా గ్రామసభలు**

**మెదక్ జిల్లాలో 'ప్రజా పాలన - ప్రగతి ప్రణాళిక' (2026) గ్రామ సభలు**

**జిల్లాలో ప్రశాంతంగా మొదటి రోజు గ్రామ సభలు నిర్వహణ**

**రాష్ట్ర గీతాన్ని ఆలపించి, ముఖ్యమంత్రి సందేశాన్ని వినిపించి గ్రామసభల ప్రారంభం**

**మెదక్ జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్**



**మెదక్ జిల్లా ప్రతినిధి ఏప్రిల్ 2 ప్రజా రిపబ్లిక్ న్యూస్**
99 రోజుల ప్రజా పాలన – ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా... గురువారం జిల్లాలోని చేగుంట మండలంలోని వడియారం గ్రామ పరిధిలో గల గ్రామ పంచాయతీ కార్యాలయంలో గ్రామ సభను ఏర్పాటు చేశారు.
ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్. హాజరయ్యారు.అనంతరం ముఖ్యమంత్రి సందేశాన్ని, గ్రామ పంచాయతీ నివేదికను పంచాయతీ సర్పంచ్ గ్రామ సభలో చదివి వినిపించాగా, పలువురు సంక్షేమ పథకాలు పొందిన లబ్దిదారులు వారి అభిప్రాయాలను వెల్లడించారు.
అదే విధంగా నూతన పథకాలైన ముఖ్యమంత్రి అల్పాహారం పథకం, ఇందిరమ్మ జీవిత కుటుంబ బీమా, మధ్యాహ్న భోజన పథకం – ఇంటర్మీడియట్ కు విస్తరణ, విభిన్న ప్రతిభావంత ఇంటర్మీడియట్ విద్యార్థులకు మోటారు వాహనాలు, పంటల వైవిధ్యం, సహజ సేంద్రీయ వ్యవసాయం పథకాలపై అవగాహన కల్పించారు.
అలాగే వివిధ పథకాల లబ్ధిదారులు ఈ సందర్భంగా వారి అభిప్రాయాలను తెలియజేస్తూ.. ప్రజా ప్రభుత్వంలో నిరుపేద లైన తమకి వివిధ రకాల సంక్షేమ పథకాల ద్వారా లబ్ధి చేకూరిందని హర్షం వ్యక్తం చేశారు..
సందర్భంగా గ్రామసభను ఉద్దేశించి జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ మాట్లాడుతూ., చేగుంట మండలం వడియారం గ్రామపంచాయతీ ఆదర్శ గ్రామపంచాయతీగా తీర్చిదిద్దాలని చెప్పారు. గ్రామస్తులకు ప్రభుత్వ ప్రయోజనాలను చేరువ చేస్తున్నామన్నారు.
ప్రభుత్వ సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలను జిల్లాలో పకడ్బందీగా అమలు చేయడం జరుగుతుందని తెలిపారు. ప్రభుత్వ గ్యారంటీ పథకాలతో పాటు, కొత్త రేషన్ కార్డుల ద్వారా సన్నబియ్యం పంపిణీ చేయడం జరుగుతుందన్నారు. అన్ని హాస్టళ్లు, స్కూళ్లలో డైట్ ఛార్జీలు, కాస్మెటిక్ ఛార్జీలను పెంచడం ద్వారా పేద విద్యార్థులకు మెరుగైన ఆహారం, వసతులు కల్పిస్తున్నట్లు వివరించారు.వడియారం గ్రామ పంచాయతీలో మొదటి విడతగా సుమారు 32 ఇండ్లు, నూతన రేషన్ కార్డులు 188,ఆరోగ్య శ్రీ లో 151 మందికి లబ్ధి, గృహ జ్యోతి 574 మంది లబ్ధి దారులు, రుణ మాఫీ 166 మంది రైతులకు, చేయూత పెన్షన్ ద్వారా 513 మంది, కళ్యాణ లక్ష్మి 25 మంది కి లబ్ధి చేకూరిందని తెలిపారు.అర్హులైన ప్రతి ఒక్కరికీ ఇళ్లు అందుతాయన్నారు.
మహిళా సాధికారత కొరకు మహిళా సంఘాలకు వడ్డీ లేని రుణాలు, స్కూల్ యూనిఫాం కుట్టే పనులు, ఆర్టీసీ డ్రైవింగ్ శిక్షణ వంటి కార్యక్రమాల ద్వారా ఆర్థికంగా బలోపేతం చేయడం జరుగుతుందన్నారు. గ్రామాలలో ఉన్న తాగునీరు, సీసీ రోడ్లు, డ్రైనేజీ వంటి సమస్యలను దశలవారీగా పరిష్కరిస్తామని ప్రజలకు ,గ్రామాల్లోని సమస్యలను ప్రత్యక్షంగా తెలుసుకుని పరిష్కరించడమే ఈ సభల ముఖ్య ఉద్దేశమని అన్నారు. ముఖ్యంగా ఇంద్రమ్మ ఇళ్ల ఎంపిక ప్రక్రియను రాజకీయాలకు అతీతంగా, పారదర్శకంగా గెజిటెడ్ అధికారుల సమక్షంలో నిర్వహిస్తున్నామని, అర్హులైన ప్రతి పేదవాడికి ఇల్లు అందేలా నాలుగు విడతల్లో ఈ పథకాన్ని అమలు చేస్తామని భరోసా ఇచ్చారు. గ్రామంలో సిసి రోడ్లు, డ్రైనేజీ వ్యవస్థ, తాగునీటి కోసం కొత్త బోరుబావుల మంజూరు వంటి అభివృద్ధి పనులపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. అలాగే, వేసవి దృష్ట్యా విద్యుత్ వినియోగంపై ప్రజలు జాగ్రత్తగా ఉండాలని, అధికారులు ఫోన్లకు అందుబాటులో ఉండి సమస్యలను పరిష్కరించాలని ఆదేశిస్తూ, అధికారుల సమన్వయంతో జిల్లాను అన్ని రంగాల్లో అభివృద్ధి చేయాలన్నారు.

గ్రామ అభివృద్ధి కోసం ప్రజల భాగస్వామ్యం కీలకమని, గ్రామాన్ని పరిశుభ్రంగా ఉంచడం, పిల్లల విద్యపై దృష్టి పెట్టడం, ఆరోగ్య పరిరక్షణపై శ్రద్ధ వహించాలని కలెక్టర్ పిలుపునిచ్చారు.
గ్రామ సభలో ప్రజలు తమ సమస్యలను కలెక్టర్ దృష్టికి తీసుకురాగా, వాటిని సంబంధిత శాఖల అధికారులు నమోదు చేసి త్వరితగతిన పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు.
ఈ కార్యక్రమంలో , ప్రత్యేక అధికారిణి హేమ భార్గవి,, సర్పంచ్ సాయికుమార్,మెడికల్ ఆఫీసర్ అనిల్ కుమార్ రెడ్డి, ఉపసర్పంచ్ బండారి నాగరాజు, పంచాయతీ కార్యదర్శి,ఇన్చార్జి ఎం.పీ.ఓ
, విజయపాల్ ప్రజా ప్రతినిధులు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# కౌన్సిలర్ జాడ ఎక్కడ

## ఆందోల్ నాలుగో వార్డ్ కౌన్సిలర్ భార్యనా ,భర్త నా అయోమయంలో ప్రజలు

**ఆందోల్ ప్రతినిధి ఏప్రిల్ 2 ప్రజా రిపబ్లిక్ న్యూస్**
ఈరోజు ఆందోల్ జోగిపేట మున్సిపాలిటీ పరిధిలోని నాలుగో వార్డులో ప్రగతి పాలన ప్రజా పాలన భాగంగా 99 ప్రణాళికల భాగంగా వార్డులో సమావేశం ఏర్పాటు చేశారు వార్డు సమస్యలు ఇందిరమ్మ ఇల్లు పెన్షన్ రేషన్ కార్డులు రైతు భరోసా పలు పథకాల పైన జరిగినటువంటి కార్యక్రమంలో కౌన్సిలర్ అభ్యర్థి ఈ సమావేశంలో కనబడకపోవడం ఆమెకు బదులు భర్త పాల్గొనడం పెద్ద చర్చ గా మారింది ఇదివరకే రాష్ట్ర ప్రభుత్వం రాష్ట్ర గతంలో జిల్లా ఇన్చార్జి మంత్రిగా ఉన్నటువంటి కొండా సురేఖ పత్రిక ప్రకటన ద్వారా ఏదైనా ప్రభుత్వ సంక్షేమ పథకాలకు సంబంధించిన కార్యక్రమాలు గాని సమావేశాలు గాని నిర్వహించ తలపెట్టినప్పుడు భార్యలకు బదులు భర్తలు ఉండడం




సరైన పద్ధతి కాదని ఎవరైనా అలా చేస్తే చట్టపరమైన చర్యలు ఉంటాయని ఆమె వివరణలో తెలపడం జరిగింది అదే మాదిరిలో ఈరోజు జరిగిన ప్రజా పాలన ఆందోల్ మున్సిపాలిటీ పరిధిలో నాలుగో వార్డ్ సమావేశ కార్యక్రమంలో మహిళా కౌన్సిలర్ అయినటువంటి ఆమె



కార్యక్రమంలో కనబడకుండా ఆమెకు బదులు ఆమె భర్త పాల్గొనడం సరైన పద్ధతి అవునా కాదా అని ఆలోచించి అధికారులు చట్టపరమైన చర్యలు తీసుకుంటారని నాలుగో వార్డ్ లో ఉన్నటువంటి ప్రజలు విజ్ఞప్తి చేశారు

# అమరావతి చట్టబద్ధతపై టిడిపి శ్రేణులు సంబరాలు

## టపాసుల మోతతో విజయోత్సవ కార్యక్రమం



**చౌడేపల్లి ప్రతినిధి ఏప్రిల్ 02 రిపబ్లిక్ న్యూస్**
ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర శాస్వత రాజధానిగా అమరావతికి చట్టబద్ధత కల్పించడంపై టిడిపి శ్రేణులు సంబరాలు జరుపుకున్నారు. గురువారం స్థానిక బస్టాండ్ లో టపాసుల మోతతో ప్రాధాన మంత్రి నరేంద్రమోడీ, హోం శాఖ మంత్రి అమిత్ షా, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ చిత్రపటాలకు పాలాబిషేకం మండల ప్రధాన కార్యదర్శి బోయకొండ సుబ్రమణ్యం(సుబ్బు) ఆద్వర్యంలో విజయోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు.అనంతరం ప్రయాణికులకు స్విట్లు పంపిణీ చేశారు.ఈ కార్యక్రమంలో రాజంపేట పార్లమెంట్ ఉపాధ్యక్షులు పొన్నా సోమశేఖర్, శ్రీధర్ రాజు(గిరి రాజు), పాళ్యం రెడ్డి,రాధాకృష్ణ, పరికిదొన చెంగల్రాయలు, విజయభాస్కర్ రెడ్డి,యనమసామన పల్లి నాగరాజ రెడ్డి,భారీ సంఖ్యలో కార్యకర్తలు పాల్గొన్నారు.

# ప్రగతి పాలన ప్రజాపాలన.

## 5వ వార్డు కౌన్సిలర్ కొత్త గొల్ల మాధవి శ్రీనివాస్ యాదవ్



**అందోల్ నియోజకవర్గం ప్రతినిధి ఏప్రిల్ 2 ప్రజా రిపబ్లిక్ న్యూస్**
అందోల్ జోగిపేట మున్సిపాలిటీ పరిధిలో ఉన్న 5వ వార్డులో ప్రగతిపాలన ప్రజా పాలన భాగంగా 99 ప్రణాళికల భాగంగా వార్డులో సమావేశం ఏర్పాటు చేశారు. వార్డు సమస్యలు, ఇందిరమ్మ ఇల్లు, పెన్షన్, రేషన్ కార్డు, రైతు భరోసా, పలు పథకాల కౌన్సిలర్ కొత్తగొల్ల మాధవి శ్రీనివాస్ యాదవ్ తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వార్డు ఆఫీసర్ రాములు , మాజీ వైస్ చైర్మన్ తుడుం రాములు, అంబేద్కర్ సంఘం అధ్యక్షుడు పెండ అరవింద్, బండల రవి కుమార్, పుర్ర శ్రీనివాస్, విష్ణు, ఉషయ్య, తుడుం కిష్టయ్య ,తుడుం పోచయ్య, పెండ గోపాల్, తదితరులు పాల్గొన్నారు.



# సీఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ చేసిన ఎమ్మెల్యే డాక్టర్ కల్వకుంట్ల సంజయ్



**మల్లాపూర్ ఏప్రిల్ 2 (రిపబ్లిక్ న్యూస్)**
మల్లాపూర్ మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో మల్లాపూర్ మండలానికి చెందిన 54 మంది లబ్ధిదారులకు మొత్తం రూ. 15,11,500/- (పదిహేను లక్షల పదకొండు వేల ఐదు వందల రూపాయలు) విలువైన సీఎంఆర్ఎఫ్ చెక్కులను లబ్ధిదారులకు అందించారు..ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు మరియు లబ్ధిదారులు పాల్గొన్నారు

# కమానియం.. .. శ్రీకరి వీరభద్రస్వామి రథోత్సవం





**మంత్రాలయం, ఏప్రిల్, 2, (రిపబ్లిక్ న్యూస్ ):** మంత్రాలయం మండలంలోని కల్లుదేవ కుంట గ్రామంలో శ్రీ కరవీరభద్ర స్వామి రథోత్సవం కమానియంగా సాగింది. ఈ రథోత్సవానికి ముఖ్య అతిథులుగా రాంపురం రెడ్డి సోదరులు వైసీపీ సీనియర్ నాయకులు టీటీడీ ట్రస్ట్ బోర్డు మాజీ సభ్యులు వై సీతారామ రెడ్డి హాజరయ్యారు గురువారం ఈ సందర్భంగా శ్రీ కరి వీరభద్ర స్వామి ఆలయంలో వేద పండితులు, పురోహితులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. వంశ పారంపర్య ఆలయ ధర్మకర్త కే రాఘవరెడ్డి ఆధ్వర్యంలో ఉత్సవ మూర్తిని ప్రత్యేకంగా అలంకరించి రథంపై ఆధిష్టించారు. దేవాలయం దగ్గర నుండి శ్రీ శర్వమాంబ గుడి వరకు భక్తులు నడుము స్మరిస్తూ రథోత్సవాన్ని లాగి తిరిగి యథాస్థానికి తీసుకొచ్చారు. రథోత్సవాన్ని తిలకించేందుకు భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చారు.ఈ కార్యక్రమంలో వైసిపీ సీనియర్ నాయకులు సొసైటీ మాజీ చైర్మన్ కె. రఘునాథ్ రెడ్డి, కే.శివారెడ్డి, సర్పంచ్. రవీంద్రరెడ్డి, కే. మల్లికార్జున రెడ్డి, యువ నాయకులు కె. విఖ్యాత్ రెడ్డి, మహేశ్వర రెడ్డి, సోమేశ్వరరెడ్డి, గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు. ఎలాంటిఆవాంచనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు ఎస్సై మల్లికార్జున ఆధ్వర్యంలో బందోబస్తు నిర్వహించారు.

# ఆలూరు నియోజకవర్గం రూపు రేఖలు మార్చిన ఘనత వైకుంఠం జ్యోతి దే

## మాజీ జడ్పిటిసి మీనాక్షి నాయుడు





**చిప్పగిరి ఏప్రిల్ ,2 (రిపబ్లిక్ న్యూస్)** ఆలూరు నియోజకవర్గం రూపు రేఖలు మార్చిన ఘనత వైకుంఠం జ్యోతి, వైకుంఠం శివప్రసాద్ దే అని మాజీ జెడ్పిటిసి మీనాక్షి నాయుడు తెలిపారు, గురువారం మండల స్థాయి కమిటీ సమావేశంలో మండల కన్వీనర్ కొండ పురుషోత్తం ఆధ్వర్యంలో నిర్వహించారు, మాజీ జెడ్పిటిసి మీనాక్షి నాయుడు మాట్లాడుతూ ఎమ్మెల్యే బుసినే వీరుపాక్షి ప్రతిసారి సమావేశము పెట్టినప్పుడు మీరు ఏమీ అభివృద్ధి చేశారు అని మా వైకుంఠం జ్యోతిని ప్రశ్నిస్తున్నారు కదా ఎనర్జీ ఎస్ నిధులు తప్ప ఏమీ అభివృద్ధి జరగలేదని అంటున్నారు ఈరోజు మేము చేసిన అభివృద్ధి బుసినే విరుపాక్షి కి తెలియ చెప్పాలని ఈ సమావేశం పెట్టామని జలజీవన్ మిషన్ క్రింద జోరాపురం గ్రామానికి ఆరు కోట్ల 75 లక్షల రూపాయలు నిధులు రావడం జరిగిందని, మనే కుర్తి గోనహాళ్ 80 లక్షలు, వెంకటాపురం కి ఒక కోటి 72 లక్షలు, మీరాపురంకు 82 లక్షలు, బీటి రోడ్డు కోటకొండ నుండి లక్కసాగరం వరకు 6 కోట్లు, హాలహర్వి నుండి కర్ణాటక బార్డర్ వరకు మరియు చిప్పగిరి నుంచి ఏ ఏరూరు కు నంచర్ల నుండి చిప్పగిరి బీటీ రోడ్డు, నిధులు మంజూరు చేయించారని, ఆరు నెలల్లోనే ఇంత అభివృద్ధి జరుగుతుందని ఎవ్వరూ ఊహించలేదని, అదేవిధంగా మొలగవల్లి కొట్టాల కరెంటు లేక అద్వాన పరిస్థితుల్లో గ్రామ ప్రజలు ఇన్చార్జి గారికి సమస్య చెబితే పది రోజుల్లో సమస్య పరిష్కారం జరిగిందని, ప్రతి గ్రామంలో సిసి రోడ్లు వేశారని, సంఘాల గ్రామంలో త్రాగునీటి సమస్య తీర్చారని, మేమందరం అభివృద్ధి సంక్షేమ వైపు నడుస్తున్నామని 2029 లో తెలుగుదేశం పార్టీ గెలిపించుకుంటామని, సుమారుగా నియోజకవర్గ మొత్తం 266 కోట్లు అభివృద్ధి జరిగిందని తెలిపారు, ఈ కార్యక్రమంలో సొసైటీ చైర్మన్ కొండ రామాంజనేయులు, సాగునీటి అధ్యక్షుడు కిష్టప్ప, చిప్పగిరి సర్పంచ్ దాసరి గోవిందరాజులు, మాజీ మండల కన్వీనర్ వలి,సీనియర్ నాయకుడు రామదుర్గం తిమ్మయ్య ,బిజెపి నియోజకవర్గ నాయకుడు తిమ్మప్ప , నేమకల్ సన్నప్ప,బిజెపి మండల కన్వీనర్ గోపాల్, బంటనహాళ్ సురేష్, బెల్డోన కరివేముల గోవిందు, నగర డోనా కమ్మ పులికొండ, నగరడోన నాగార్జున, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా భోగేశ్వర స్వామి రథోత్సవం






**చిప్పగిరి ,ఏప్రిల్, 2 ,(రిపబ్లిక్ న్యూస్)** చిప్పగిరి నందు గురువారం ఘనంగా భోగేశ్వర స్వామి రథోత్సవం జరిగింది ,ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే బుసినే విరుపాక్షి, సీనియర్ నాయకులు వైకుంఠ మల్లికార్జున చౌదరి పాల్గొని దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు ,ప్రజలు సుఖ సంతోషాలతో ఉండాలని రైతులకు పంటలు సస్య శ్యామలంగా పండాలని పూజలు నిర్వహించామని తెలిపారు ,ఈ కార్యక్రమంలో పార్టీ కార్యకర్తలు, గ్రామ ప్రజలు, తదితరులు పాల్గొన్నారు.

## ఏపీ రాష్ట్ర శాశ్వత రాజధానిగా అమరావతి రాజ్యసభలో ఆమోదం పొందినందుకు పాములపాడులో కొవ్వొత్తుల ప్రదర్శన నిర్వహించిన టిడిపి నాయకులు



**పాములపాడు ఏప్రిల్ 2 రిపబ్లిక్ న్యూస్:-**తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షుడు & ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఉత్తర్వుల మేరకు, నంద్యాల పార్లమెంటు టీడీపీ ఇంచార్జి మాంద్ర.శివానంద రెడ్డి, నందికొట్కూరు నియోజకవర్గం శాసన సభ్యులు గిత్త.జయసూర్య ల ఆదేశాల మేరకు పాములపాడు మండల కేంద్రంలో రాజధాని అమరావతికి చట్టబద్ధత కల్పించినందుకు నాయకులు కే.సి.కెనాల్ డిసి మద్దూరు తిమ్మారెడ్డి, సొసైటీ ఛైర్మెన్ రాయపాటి గోవిందు, టిడిపి బీసీ సెల్ మండల అధ్యక్షుడు కంభం.మోహన్ గౌడు, మండల ఎస్సీ సెల్ అధ్యక్షుడు లింగాల నాగరాజు, మండల తెలుగు యువత అధ్యక్షుడు షేక్.కరీంబాష, వేంపెంట సింగిల్ విండో డైరెక్టర్ వెంకటేశ్వర రావు, ఎస్సీ సెల్ మండల ఉపాధ్యక్షుడు రవీంద్ర, రాయపాటి మల్లికార్జున, జూటూరు పూసల కృష్ణ, శేఖర్ బోగల్ల, కె.నరసింహ, ఎం.శేఖర్, కె.అశోక్, రామకృష్ణ, రాజు రవి , అన్సర్ బాషా, తదితర నాయకులు కలిసి సంతోషంగా కొవ్వొత్తుల ప్రదర్శన నిర్వహించడం జరిగింది.ఈ సందర్భంగా తెలుగుదేశం పార్టీ మండల నాయకులు మాట్లాడుతూ అమరావతి చట్టబద్ధత బిల్లుకు రాజ్యసభ ఆమోదం లభించిందని తెలిపారు.మూజువాణి ఓటుతో బిల్లుకు రాజ్యసభ ఆమోదం పొందడం జరిగిందన్నారు.నిన్న లోక్‌సభ, ఈ రోజు రాజ్యసభలో అమరావతి బిల్లు ఆమోదం పొందడం జరిగిందన్నారు.పార్లమెంట్ ఆమోదంతో రాష్ట్రపతి వద్దకు వెళ్లనున్న బిల్లు,రాష్ట్రపతి సంతకం తర్వాత ఏపీ రాజధానిగా అమరావతికి చట్టబద్ధత వస్తుందన్నారు.

# రమణీయం.. రామప్ప తాత రథోత్సవం





**మంత్రాలయం, ఏప్రిల్, 2,(రిపబ్లిక్ న్యూస్ ):**
మండలంలోని తిమ్మాపురం గ్రామంలో శ్రీ రామప్ప తాత రథోత్సవం భక్తుల నడుమ రమణీయంగా జరిగింది. గురువారం ఈ సందర్భంగా ఆలయంలో వేద పండితులు పురోహితులు ప్రత్యేక ఉత్సవ మూర్తిని ప్రత్యేకంగా అలంకరించి రథోత్సవం పై అదృష్టంచి రామప్ప దేవాలయం నుండి రథోత్సవాన్ని లాగి మరలా యథాస్థితికి చేర్చారు ఈ రథోత్సవాన్ని తిలపించేందుకు వగరూరు, సుంకేశ్వరి తదితర గ్రామాల నుండి భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చారు. అంతకుముందు తెలుగుదేశం ఇన్చార్జ్ రాఘవేంద్ర రెడ్డి సోదరులు మాజీ సర్పంచ్ రఘునాథ్ రెడ్డి రామప్ప తాతకు ప్రత్యేక పూజలు చేసి మొక్కలు తీర్చుకున్నారు. ఆ గ్రామ నాయకులు రఘునాథ్ రెడ్డికి శాలువా పూలుమాలతో ఘనంగా సత్కరించారు .రథోత్సవ సమయంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటన జరగకుండా ఎస్సై మల్లికార్జున ఆధ్వర్యంలో బందోబస్తు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నాయకులు కేశన్న, మాజీ సర్పంచ్ వీరారెడ్డి, దేవేంద్ర, రాగప్ప, గోపాల్, గోవిందా రెడ్డి, అయ్యప్ప రెడ్డి,రమేష్,కుమ్మరి శేఖర్ గోవిందు, నాగేంద్ర, లక్ష్మీకాంత్ రెడ్డి తదితరులు ఉన్నారు

# ఆంధ్రప్రదేశ్‌కు శాశ్వత రాజధాని ఆమోదం -జనసేన శ్రేణుల్లో సంబరాలు

## బిర్లా కాంపౌండ్‌లో దీపప్రజ్వలన, బాణసంచా పేల్చి ఆనందం వ్యక్తం చేసిన జనసేన నాయకులు





**కర్నూలు ప్రతినిధి (రిపబ్లిక్ న్యూస్ ఏప్రిల్ 2)**
ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి శాశ్వత రాజధాని విషయంపై లోక్‌సభ, రాజ్యసభల్లో ఆమోదం లభించడంతో జనసేన పార్టీ శ్రేణులు సంబరాల్లో మునిగిపోయాయి. ఈ సందర్భంగా కర్నూలులోని బిర్లా కాంపౌండ్‌లో ఉన్న జనసేన కార్యాలయంలో పార్టీ నాయకులు దీపప్రజ్వలన చేసి, బాణసంచా పేలుస్తూ ఆనందాన్ని పంచుకున్నారు.
ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ ఉమ్మడి కర్నూలు జిల్లా కోఆర్డినేటర్ చింత సురేష్ బాబు మాట్లాడుతూ, గత పది సంవత్సరాలుగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి రాజధాని లేకుండా చేసిన వైసీపీ ప్రభుత్వానికి రాష్ట్ర ప్రజలు గట్టి బుద్ధి చెప్పారని అన్నారు. ఇటీవల జరిగిన ఎన్నికల్లో వైసీపీని 11 సీట్లకు పరిమితం చేయడం ప్రజల తీర్పుకు నిదర్శనమని పేర్కొన్నారు. రాబోయే రోజుల్లో ఆంధ్రప్రదేశ్ రాజధాని దేశంలోనే నంబర్ వన్ గా నిలుస్తుందని ఆయన విశ్వాసం వ్యక్తం చేశారు.
ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు పి.బి.వి. సుబ్బయ్య, తోళ్ళ మంజునాథ్, బజారి, షబ్బీర్, చంద్రమౌలి, రాజ్ గోపాల్, మనోహర్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రజా సమస్యల పరిష్కారమే కూటమి ప్రభుత్వ లక్ష్యం

## ముక్కా రూపానందరెడ్డి.





**ఓబులవారిపల్లి ఏప్రిల్ 2 రిపబ్లిక్ న్యూస్.**
ప్రజా సమస్యల పరిష్కారమే కూటమి ప్రభుత్వ ప్రధమ లక్ష్యమని కూడా చైర్మన్ రైల్వే కోడూరు నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు ముక్కా రూపానంద రెడ్డి గురువారం ప్రజాదర్బార్లో పాల్గొన్న ప్రజలను ఉద్దేశించి ఆయన అన్నారు, రైల్వే కోడూరు మండలం రాఘవరాజపురం తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో గురువారం నిర్వహించిన ప్రజాదర్బార్ లో రైల్వే కోడూరు నియోజకవర్గం చిట్వేలి పెనగలూరు పుల్లంపేట ఓబులవారిపల్లి రైల్వే కోడూరు మండలాల నుండి అధిక సంఖ్యలో ప్రజలు సమస్యల వినతి పత్రాలతో ప్రజాదర్బాలలో పాల్గొని రూపానంద రెడ్డికి అందజేయడం జరిగినది ఈ నేపథ్యంలో ఆయన వింత పత్రాలను పరిశీలించి పరిష్కరించదగ్గ సమస్యలను అధికారులతో మాట్లాడి పరిష్కరించడం జరిగినది, సమావేశంలో పరిష్కారం కానీ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లి ఈ ప్రజా సమస్య లను పరిష్కారమయ్యే విధంగా ఆలోచించి న్యాయం చేయాలని ఆయన అధికారులను కోరారు, ఈ సమావేశంలో ప్రజలు తమ సమస్యలను రూపానంద రెడ్డి దృష్టికి నేరుగా విన్నవించుకోవడం ఆయన స్పందించి న్యాయం చేస్తామని సభలో పాల్గొన్న అందరికీ హామీ ఇవ్వడం జరిగినది,
స్థానిక సమస్యలను ఆలోచనాత్మకంగా వింటూ, ముఖ్యంగా రోడ్లు మరియు సొసైటీ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ కి సంబంధించిన సమస్యలను, రెవెన్యూ సమస్యలను గుర్తించి ప్రాధాన్యత ఇవ్వడం జరిగినది,
ఈ సందర్భంలో, రోడ్డు సమస్యలను తక్షణ పరిష్కరించేందుకు సంబంధిత అధికారులకు స్పష్టమైన సూచనలు ఇవ్వడం జరిగింది. ప్రజలకు అసౌకర్యంగ ఉన్న రోడ్డు సమస్యలనుతొలగించడానికి వాహన మార్గాలు, రోడ్లు వేగంగా మరమ్మత్తుచేయాలని అధికారులను ఆదేశించారు. ప్రజా సమస్యలను తీర్చడం ప్రభుత్వ ప్రథమ కర్తవ్యమని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు భావిస్తారని అందుకే ఈనాడు అమరావతి కోసం ఆయన చేసిన కృషి కార్యరూపం దాలుస్తోందని పేర్కొన్నారు,
పట్టణ అభివృద్ధి వేగవంతం చేయడం లక్ష్యంగా పెట్టుకున్నామని ఈ ప్రజా దర్బార్ ఆయన పంపించారు, ఈ కార్యక్రమంలో రెవిన్యూ, మండల అభివృద్ధి, రోడ్లు భవనాలు సచివాలయ అధికారులు పాల్గొన్నారు అలాగే పంచాయతీ రాజ్ డి ఇ బాల నరసింహులు కూటమి సర్పంచులు ఎంపీటీసీలు నాయకులు కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొని ప్రజాదర్బాలను విజయవంతంగా నిర్వహించడం జరిగింది

# రాజధాని అమరావతి సాధించిన అగ్ర నాయకత్వానికి కృతజ్ఞతలు,

## ఎన్టీఆర్ విగ్రహం వద్ద భారీ ర్యాలీ







**ఓబులవారిపల్లి ఏప్రిల్ 2 రిపబ్లిక్ న్యూస్.**
సంవత్సరాల పోరాటం సాధించిన అధినాయకత్వం అమరావతి ని రాజధానిగా చట్టబద్ధత సాధించిన రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ లకు, సహకరించిన దేశ ప్రధానమంత్రి నరేంద్ర మోడీ చిత్రపటాలకు పాలాభిషేకం చేసి కృతజ్ఞతలు తెలియజేసిన రాష్ట్ర ప్రభుత్వ విప్ రైల్వే కోడూరు జనసేన శాసనసభ్యులు అరవ శ్రీధర్ మరియు తెలుగుదేశం పార్టీ యువ నేత ముక్కా సాయి వికాస్ రెడ్డి, ఆంధ్ర రాష్ట్ర రాజధానిగా అమరావతిని సాధించిన సందర్భంగా నాయకులకు కృతజ్ఞతలు తెలియజేస్తూ రైల్వే కోడూరు ఎన్టీఆర్ విగ్రహం వద్ద వేలాది మందితో భారీ ర్యాలీ గురువారం నిర్వహించడం జరిగినది ఈ సందర్భంగా ఆరవ శ్రీధర్ మాట్లాడుతూ
అమరావతి రాజధాని చట్టబద్ధత సాధించడం అనేది ఎన్నో సంవత్సరాల పోరాటానికి ఫలితం. రైతులు, ప్రజల త్యాగాలతో సాధించిన ఈ విజయాన్ని మనమంతా ఘనంగా జరుపుకోవాలి,చంద్రబాబు నాయుడు అహర్నిశలు కృషి చేసి ఈ లక్ష్యాన్ని సాధించారు. ఈ విజయంతో ఆంధ్రప్రదేశ్ అభివృద్ధికి కొత్త దారులు తెరుచుకున్నాయని పేర్కొన్నారు
ఈ సందర్భంగాముక్కా సాయి వికాస్ రెడ్డి మాట్లాడుతూ, ఎన్నో అడ్డంకులు ఎదురైనా ఆంధ్రప్రదేశ్ అభివృద్ధి కోసం అమరావతిని రాజధానిగా నిర్మించాలన్న చంద్రబాబు నాయుడు సంకల్పం నేటి విజయంగా నిలిచిందన్నారు.
ఈ చారిత్రాత్మక ఘట్టాన్ని ప్రతి ఆంధ్రుడు గర్వంగా జరుపుకోవాలని పిలుపునిచ్చారు.
ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి తాతం శెట్టి నాగేంద్ర జయప్రకాశ్ కూటమి నాయుకులు కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొని అమరావతి రాజధానికి మద్దతుగా తమ ఐక్యతను చాటారు.

# నాసిరకంతో చంపేస్తారా...?

- పోషకాల లోపం ... ఐనా ... వడ్డిస్తారా ...
- నీరసించి పోతున్న రోగులకు ఇదే నైవేద్యం ...
- నిర్వహణలో ఏజెన్సీల నిర్లక్ష్యపు నిర్వాకం ... ?
- సూపర్ ఫుడ్డు.. వెరీ గుడ్డు.. పెట్టేదెప్పుడు ... ?
- విలవిల పోతున్న రోగులకు నాసిరకమే పౌష్టికమా ... ?
- పర్యవేక్షణ లేక ఏజెన్సీల ఇష్టారాజ్యం ...
- బాధ్యులపై చర్యల డిమాండ్ ...




**రిపబ్లిక్ క్రైమ్, ఏప్రిల్ 02, అనంతపురం**
అనంతపురం సర్వజన ఆసుపత్రిలో నిత్యం రోగులు రద్దీగా ఉంటారు. మొత్తం 18 డిపార్ట్మెంట్లలో రోగులు అధిక సంఖ్యలో ఉన్నారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన రోగులు చికిత్స నిమిత్తం ఆస్పత్రిలో అడ్మిట్ అయ్యి ఉంటారు. ఆసుపత్రులలో వీరికి ప్రభుత్వం పౌష్టిక ఆహారాన్ని అందించాలి. మెనూ ప్రకారం పోషక విలువలతో గల ఆహారాన్ని అందించాల్సి ఉంది. నాణ్యమైన అన్నం, పప్పు, రసం, కూర, మజ్జిగ, అరటిపండు ఇలా అందించాల్సి ఉంటే
నాసిరకంగా రోగులు తినలేని ఆహారాన్ని ఏజెన్సీ నిర్వాహకులు వడ్డిస్తున్నారు. తినడానికి పనికిరాని ఆహారాన్ని రోగులకు అందజేస్తూ పబ్బం గడుపుతున్నారు.
ఈ ఆహారాన్ని తినలేని రోగులు పస్తులతోనే ఉండిపోతున్నారు. దీంతో రోగులు అనేక ఇబ్బందులకు గురవుతున్నారు. కానీ ఆసుపత్రి బయట దాతలు పెట్టే ఆహారాన్ని తెచ్చుకుని తింటున్నారు. రోగులు వెంట ఉన్న బంధువులు ఆసుపత్రిలో పెట్టే ఆహారం తినలేక పోతున్నామని వాపోతున్నారు. దీనివల్ల రోగుల ఆరోగ్యం ప్రమాదకరంగా మారుతోందని బంధువులు ఆరోపిస్తున్నారు. అధికారులు వెంటనే స్పందించి ఆహార నాణ్యతపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.

### అధికారులు ఆహార నాణ్యతపై చర్యలు తీసుకోవాలి

అనంతపురం సర్వజన ఆసుపత్రిలో నాసిరకమైన ఆహారం అందిస్తూ ఏజెన్సీ నిర్వాహకులు రోగుల ప్రాణాలతో చెలగాటమాడుతున్నారు. వివిధ ప్రాంతాల నుంచి చికిత్స కోసం ఆసుపత్రికి వచ్చే రోగులకు మందులతో పాటు పోషకాహారం అవసరం. అంతేకాక అన్నం సరిగా ఉడకకపోవడం, పప్పు నీళ్లలా ఉండటం, కూరల్లో పోషకాలు లేకపోవడం వంటి సమస్యలు రోగులను ఇబ్బందులకు గురిచేస్తున్నాయి. ఇప్పటికే అనారోగ్యంతో బలహీనంగా ఉన్న రోగులు ఈ ఆహారం తినలేక మరింత నీరసించి పోతున్నారు. ఆసుపత్రి భోజనం తింటే ఆరోగ్యం మెరుగుపడాల్సింది పోయి మరింత క్షీణిస్తోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

### కాగితాలపై మెను.. వాస్తవంగా నాసిరకమైన భోజనం

పోషకాహారం పేరుతో రోగులకు అందిస్తున్న భోజనంలో పోషకాలు దేవుడెరుగు. మెను ప్రకారం గుడ్లు, పాలు, పండ్లు ఇవ్వాల్సి ఉన్నా అవి క్రమం తప్పకుండా అందడం లేదని కొందరు రోగులు చెబుతున్నారు. కాగితాలపై మాత్రమే మెను ఉండి, వాస్తవంగా మాత్రం నాసిరకమైన భోజనం అందిస్తున్నారనే విమర్శలు ఎన్నో. పోషకాహారం అందక రోగులు మరింత బలహీనంగా మారుతున్నారని, ఆసుపత్రిలో ఇచ్చే ఆహారం తింటే ఉన్న ఊపిరి పోయేటట్లు ఉంది.. అని.. అధికారులు ఏమాత్రం తనిఖీలు చేయకపోవడంతో ఈ పరిస్థితి నెలకొన్నదని రోగులు ఆరోపిస్తున్నారు.

### ఆసుపత్రి యాజమాన్యం నిర్లక్ష్యానికి నిదర్శనం

అనారోగ్యంతో ఇప్పటికే నీరసించి పోతున్న రోగులకు అందుతున్న ఆహారం మరింత నీరసం తెచ్చేలా ఉంది. ఆసుపత్రిలో భోజనం తినలేక చాలా మంది రోగులు బయట నుంచి ఆహారం తెప్పించుకుని తింటున్నారు. దీంతో రోగులు అనేక ఇబ్బందులు పడుతున్నారు.
కానీ పేద రోగులు మాత్రం అదే నాసిరకమైన ఆహారం తినాల్సి వస్తోందని, ఆసుపత్రిలో ఇచ్చే ఆహారం వల్ల మరింత బలహీనంగా మారుతున్నామని రోగులు వాపోతున్నారు. ఆహారం నాణ్యతపై ఎవరూ పట్టించుకోవడం లేదని, ఇది ఆసుపత్రి యాజమాన్యం నిర్లక్ష్యానికి నిదర్శనమని బంధువులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.



నాసిరకం ఆహారం అందించడంతో రోగుల సంఖ్య తగ్గిన దృశ్యం



నాణ్యత లేకుండా ఉన్న ఉప్మా

ఆసుపత్రికి నిన్ననే వచ్చా నాకు అర్థం కావడం లేదు. ఆహారం ఎలా ఉంటుందో ... అంటూ రోగి సమాధానం.



నీళ్ల ఉప్మా... నీళ్ల చెట్నీ

నీళ్ల ఉప్మా, నీళ్ల చెట్నీ.. నాసిరకంగానే ఆహారం అందిస్తున్నారు. రోగుల పట్ల ఎవరు బాధ్యతగా వ్యవహరించడం లేదు. ఎలా ఉన్నా తినాల్సిన పరిస్థితి నెలకొంది. టిఫిన్ ప్లేట్లలో తీసుకెళ్తున్న ఓ రోగి బంధువు

### ఆసుపత్రి ఆహారం తినలేక రోగులు ఇబ్బందులు

ప్రభుత్వ మెను ప్రకారం రోగులకు గుడ్లు, పాలు, పండ్లు ఇవ్వాల్సి ఉన్నా అవి ఎప్పుడు ఇస్తారో తెలియని పరిస్థితి ఉంది. కాగితాలపై మాత్రమే సూపర్ ఫుడ్ మెను ఉండి, వాస్తవంగా మాత్రం సాధారణ ఆహారం కూడా సరిగా అందడం లేదు. గుడ్లు వారానికి ఎన్ని రోజులు ఇస్తున్నారో కూడా స్పష్టత లేక, పాలు, పండ్లు కూడా క్రమం తప్పకుండా అందడం లేదని రోగులు వాపోతున్నారు. విలవిల లాడుతున్న రోగులకు పౌష్టికాహారం పేరుతో నాసిరకమైన ఆహారం ఇవ్వడం దారుణమని పలువురు అభిప్రాయపడుతున్నారు. ఆసుపత్రిలో ఇచ్చే ఆహారం తినలేక రోగులు ఇబ్బందులు పడుతున్నారు. దీంతో పౌష్టికాహారం అందక రోగులు కోలుకోవడం ఆలస్యం అవుతోంది. ఇదే పరిస్థితి ఇలాగే కొనసాగితే రోగుల ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం పడే అవకాశం ఉందని వైద్య నిపుణులు హెచ్చరిస్తున్నారు. అధికారులు వెంటనే స్పందించి ఆహార నాణ్యతను మెరుగుపరచాలని ప్రజలు కోరుతున్నారు.

### నాసిరకమైన ఆహారం సరఫరా .. ఏజెన్సీపై చర్యలు

ఆసుపత్రికి ఆహారం సరఫరా చేసే ఏజెన్సీల నిర్లక్ష్యం కారణంగానే రోగులకు నాసిరకమైన ఆహారం అందుతుంది. నాణ్యతా ప్రమాణాలు పాటించకుండా తక్కువ ఖర్చుతో సరుకులు కొనుగోలు చేసి ఆహారాన్ని అందిస్తున్నారు. అందులో భాగంగా ఆసుపత్రిలో పర్యవేక్షణ లేకపోవడం వల్ల ఏజెన్సీలు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నాయి.
దీంతో కాంట్రాక్టులు తీసుకున్నప్పుడు నిర్వాహకులకు ఉన్న శ్రద్ధ.. వాటి అనంతరం నాణ్యత ప్రమాణాలు మసకబారిపోయాయి. అయితే ప్రస్తుతం ఆసుపత్రిలో రోగులకు అందజేస్తున్న ఆహార నాణ్యతను ఎవరూ పట్టించుకోవడం లేదనే విమర్శలు ఎక్కువగా ఉన్నాయి. నాసిరకమైన ఆహారం సరఫరా చేస్తున్న ఏజెన్సీలపై కఠిన చర్యలు తీసుకోవాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

### కాంట్రాక్ట్ దక్కిన తర్వాత రోగుల ప్రాణాలతో చెలగాటం

ఆసుపత్రి ఆహార సరఫరా వ్యవస్థపై సరైన పర్యవేక్షణ లేకపోవడంతో ఏజెన్సీలు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. నాణ్యతా ప్రమాణాలు పాటించకపోయినా ఆసుపత్రి అధికారులు ఎవరూ పట్టించుకోవడం లేదు. తనిఖీలు నిర్వహించాల్సిన అధికారులు చూసి చూడనట్లు వ్యవహరిస్తున్నారు. దీంతో రోగులు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రోగం వచ్చి ఆసుపత్రులకు వస్తే ఆసుపత్రులలో అందించాల్సిన నాణ్యమైన ఆహారం నాసిరకంగా ఉండడంతో రోగులు మరింత రోగులు గానే కాక అనేక రోగాల బారిన పడుతున్నారు. అధికారులు తనిఖీలు నిర్వహిస్తే అసలు పరిస్థితి బయటపడుతుందని రోగుల బంధువులు చెబుతున్నారు. కాంట్రాక్ట్ దక్కిన తర్వాత బాధ్యత మరిచిపోతూ రోగుల ప్రాణాలతో చెలగాటమాడుతున్నారని మండిపడుతున్నారు.

### నాసిరకమైన ఆహారం వడ్డిస్తున్న వారిపై చర్యలు

రోగులకు అందించాల్సిన పౌష్టికాహారం ఆసుపత్రిలో నిర్వాహకుల వల్ల బలహీనపడుతోంది. రోగులకు అందాల్సిన పోషక ఆహారం అందక రోగులు మరిన్ని రోగాలకు గురవుతున్నారని ... రోగుల బంధువులు తీవ్రంగా మండిపడుతున్నారు. ఈ వ్యవహారంపై ఉన్నతాధికారులు విచారణ జరిపించాలని, రోగుల ప్రాణాలతో చెలగాటమాడుతున్న వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని వారు కోరుతున్నారు. ఆసుపత్రిలో ఆహార నాణ్యతను మెరుగుపరచి, పోషకాహారం అందించాలని డిమాండ్ చేస్తున్నారు. అధికారులు వీటిపై దృష్టి పెట్టి రోగులకు అందాల్సిన పౌష్టిక ఆహారం అందించే విధంగా చర్యలు తీసుకోవాలని, అయితే నాణ్యత ప్రమాణాలతో కూడిన ఆహారాన్ని రోగులుగా అందించాలని వారు కోరుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందిస్తారా లేదా అన్నది వేచి చూడాల్సిందే..

---

## ప్రకృతి వ్యవసాయ విధానాలతో ఎల్‌నినో ప్రభావాన్ని తగ్గించాలి

### రైతులకు నీటి నిర్వహణ, పోషక లోపాలపై అవగాహన అత్యవసరం
### ఉద్యాన పంటల పెంపుతో జిల్లాకు ఆర్థిక వృద్ధి సాధ్యం
### జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా






**నంద్యాల, బ్యూరో ఏప్రిల్ 02 (రిపబ్లిక్ న్యూస్):**
జిల్లాలో ఉద్యాన పంటలను విస్తృతంగా పెంపొందించడం ద్వారా స్థూల దేశీయోత్పత్తి (జీడీపీ)ను పెంచే అవకాశాలు ఉన్నాయని జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి తెలిపారు. నంద్యాల పట్టణంలోని పద్మావతి నగర్‌లో ఉన్న బి9 గ్రాండ్ హోటల్‌లో నిర్వహించిన జిల్లాస్థాయి ట్రైనింగ్ ఆఫ్ ట్రైనర్స్ – కన్వర్జెన్స్ విభాగాల సమన్వయ శిక్షణ కార్యక్రమాన్ని కలెక్టర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ జి.రాజకుమారి మాట్లాడుతూ, వాతావరణ మార్పుల ప్రభావంతో ఇప్పటికే జిల్లాలో అధిక ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయని, రాబోయే మే, జూన్ నెలల్లో మరింత పెరిగే అవకాశముందని తెలిపారు. ఈ పరిస్థితుల్లో భూమి సారాన్ని కాపాడుకోవడం, లాభదాయకమైన పంటల ఎంపిక వంటి అంశాలపై రైతులకు సమగ్ర అవగాహన కల్పించడం అవసరమన్నారు.

#### ప్రీ-మాన్సూన్ డ్రై సోయింగ్ ప్రాముఖ్యం

పీఎండీఎస్ విధానం ద్వారా భూమిని ఏడాది పొడవునా పంటలతో కప్పి ఉంచవచ్చని, ఇది ఎల్‌నినో ప్రభావాన్ని తగ్గించడంలో కీలక పాత్ర పోషిస్తుందని వివరించారు. రైతులు ఈ విధానాన్ని విస్తృతంగా అనుసరించి, అందుబాటులో ఉన్న పీఎండీఎస్ కిట్లను పూర్తిగా వినియోగించుకోవాలని సూచించారు.

#### ప్రకృతి వ్యవసాయం - అదనపు ఆదాయానికి మార్గం

పొలాల గట్లను వెడల్పుగా తయారు చేసి వాటిపై కూరగాయలు, ఆకుకూరలు సాగు చేయడం ద్వారా తక్కువ పెట్టుబడితో అదనపు ఆదాయం పొందవచ్చని తెలిపారు. ప్రకృతి వ్యవసాయాన్ని ప్రోత్సహించడం ద్వారా రైతుల ఖర్చులు తగ్గడంతో పాటు, పంటల నాణ్యత మెరుగుపడుతుందని పేర్కొన్నారు.

#### భూసార పరీక్షలు, ఎరువుల వినియోగంపై దృష్టి

జిల్లాలో నైట్రోజన్ లోపం ఉండగా, ఫాస్ఫరస్ అధికంగా ఉండటం, జింక్, సల్ఫర్ తక్కువగా ఉండటం గమనార్హమని తెలిపారు. అందువల్ల రైతులు భూసార పరీక్షలు చేయించుకొని అవసరమైన పోషకాలను గుర్తించి, యూరియా, డీఏపీపై ఆధారపడకుండా కాంప్లెక్స్ ఎరువులను వినియోగించాలని సూచించారు.

#### నీటి వినియోగంలో సమర్థత అవసరం

నీటి లభ్యత పరిమితంగా ఉన్న నేపథ్యంలో అందుబాటులో ఉన్న నీటిని సమర్థంగా వినియోగించుకోవాలని, అధిక నీరు అవసరమయ్యే వరి సాగును తగ్గించి ఉద్యాన పంటల వైపు రైతులు మళ్లాలని సూచించారు. రాష్ట్ర ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకున్న ఉద్యాన పంటల విస్తరణలో జిల్లా అధికారులు చురుకుగా పనిచేయాలని ఆదేశించారు.

#### అధికారుల సమన్వయం కీలకం

వ్యవసాయ, ఉద్యాన, డీఆర్‌డీఏ తదితర శాఖల అధికారులు సమన్వయంతో పనిచేస్తూ రైతులకు సాంకేతిక పరిజ్ఞానం చేరవేయాలని కలెక్టర్ సూచించారు. అధికారులు తమ పరిజ్ఞానాన్ని నిరంతరం నవీకరించుకుంటూ, రైతులకు మార్గనిర్దేశం చేయాలని పేర్కొన్నారు. ఈ శిక్షణ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ, ఉద్యాన శాఖ అధికారులు, డీఆర్‌డీఏ ప్రతినిధులు, ప్రకృతి వ్యవసాయ నిపుణులు, సంబంధిత సిబ్బంది పాల్గొన్నారు.

## ప్రభుత్వ సర్వజన వైద్యశాలను ఆకస్మికంగా తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి








**నంద్యాల, బ్యూరోఏప్రిల్ 02 (రిపబ్లిక్ న్యూస్)** పట్టణంలోని ప్రభుత్వ సర్వజన ఆసుపత్రిలో అందిస్తున్న వైద్య సేవలను జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆసుపత్రిలోని అత్యవసర విభాగంతో పాటు ఇన్‌పేషెంట్, ఔట్‌పేషెంట్ (ఓపీ), రిజిస్ట్రేషన్ బ్లాక్, మెడికల్ ఎమర్జెన్సీ వార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న రోగులతో కలెక్టర్ నేరుగా మాట్లాడి, వారికి అందుతున్న వైద్య సేవలపై వివరాలు తెలుసుకున్నారు. రోగులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా నాణ్యమైన వైద్య సేవలు అందేలా చర్యలు తీసుకోవాలని సంబంధిత వైద్యులు, సిబ్బందిని ఆదేశించారు. ఆసుపత్రిలో శుభ్రత, సమయపాలన, సేవల నాణ్యత విషయంలో ఎలాంటి నిర్లక్ష్యం ఉండకూడదని కలెక్టర్ స్పష్టం చేసారు. ప్రజలకు మెరుగైన వైద్య సౌకర్యాలు అందించడం ప్రతి వైద్యుడి బాధ్యత అని సూచించారు. అలాగే, రోగుల అవసరాలను దృష్టిలో ఉంచుకుని సేవలను మరింత మెరుగుపరచాలని, అత్యవసర సేవలు ఎల్లప్పుడూ సిద్ధంగా ఉండేలా చూడాలని సంబంధిత అధికారులకు ఆదేశించారు.

printed and published by B.Nagendra on behalf of m/s bojja publications # 14-73, Nelliveedhi, Nandyal District, Nadyal printed at Shop No:26, Sri Nidhi Tiffen Centere Opp, Srinivasa Complex, Nandyal (Dist) AP. pin-code - 518501. EDITOR: BOJJANAGENDRA, RNI No: RNI No:/2023/87888 Phone No: +91 99488 14188, Email id: prajarepublic144@gmail.com